

మురికిమళ్ల చెంచుగూడెంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

నత్తనడకన పీఎం జన్‌మన్

● బిల్లులు రాక నిలిచిన చెంచు గిరిజనుల ఇళ్ల నిర్మాణం ● రూ.కోటికి పైగా నిలిచిన బకాయిలు

చెంచు గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బృహత్తర పీఎం జన్‌మన్ (ప్రధాన మంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపుగా రూ.కోటికి పైగా బిల్లులు నిలిచిపోవడంతో నిర్మాణాలకు లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నారు.

త్రిపురాంతకం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చెంచు గిరిజనులు ఉన్న ప్రాంతాల్లో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇళ్లను మంజూరు చేశారు. అయితే ఇప్పటి వరకు వివిధ దశల్లో ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించని కారణంగా పలు నిర్మాణాలు నిలిచిపోయాయి. మొత్తంగా 130 మందికి పైగా లబ్ధిదారులకు దాదాపు రూ.కోటికిపైగా బిల్లుల రూపంలో రావాల్సి ఉంది. మార్కాపురం డివిజన్‌లో ఉన్న మొత్తం చెంచు కుటుంబాల్లో 686 మందికి ఇళ్లు మంజూరు చేశారు. అందులో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 598, గిద్దలూరు నియోజకవర్గంలో 74, మార్కాపురంలో 14 గృహాలు మంజూరు అయ్యాయి. అత్యధికంగా మంజూరైన ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలంలో 231, దోర్నాల మండలంలో 176, ఎర్రగొండపాలెం మండలంలో 179, పెద్దారవీడు మండలంలో 12 ఇళ్లు మంజూరు అయ్యాయి. గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడులో 69, గిద్దలూరులో 5 గృహాలు ఈ పథకం కింద మంజూరయ్యాయి. వీటికిగాను ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.2.39 లక్షలు చెల్లిస్తోంది. ఇవికాకుండా సౌరవిద్యుత్ ఏర్పాటుకు అదనంగా ఖర్చు చేస్తోంది. వీటిలో ఇప్పటికి కేవలం 19 గృహాలు పూర్తికాగా 372 గృహాల నిర్మాణమే ప్రారంభించలేదు. మరో 314 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు నిర్మాణం జరిగి వివిధ దశల్లో ఉన్న గృహాల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించని కారణంగానే అవి నత్తనడకన సాగుతున్నాయని తెలుస్తోంది. ఇళ్ల నిర్మాణంకోసం తాపీ మేస్త్రీలను మాట్లాడుకుని నిర్మాణాలు చేపట్టిన గిరిజనులకు దశల వారీగా చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. చెల్లింపుల్లో జాప్యం జరిగితే నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉందని లబ్ధిదారులు చెబుతున్నారు. పథకం లక్ష్యం మంచిదైనప్పటికీ మిగతా 6లో...



ఇటీవల దేవరాజుగట్టు వద్ద ఓ లారీ అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న బంకుల్లోకి దూసుకుపోయింది. మూడు బంకులు ధ్వంసమయ్యాయి. లారీ యజమాని నుంచి రూ.లక్ష మేర వసూలు చేసిన పోలీసు అధికారి రెండు బంకుల వాళ్లకు రూ.10వేల ఇచ్చి మరొకరిని భయపెట్టి పంపినట్లు తెలిసింది.

కలనూతల గ్రామంలో అధికార పార్టీ సానుభూతిపరుడి పొలంలో ఆరు నెలల క్రితం విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఆ గ్రామ వైసీపీ నాయకునితో కలిసి ప్రణాళిక వేసి రైతును భయపెట్టి రూ.3లక్షల మేర వసూలు చేసినట్లు తెలిసింది.

చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లిలో కంచర్ల కేశవులు అనే టీడీపీ సానుభూతిపరుడిపై గ్రామానికి చెందిన వైసీపీ అగ్రకులస్థులు కర్రలతో విచక్షణారహితంగా దాడిచేసి కొట్టారు. ఆ వీడియో అప్పట్లో సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. కానీ సాధారణ కేసుగా నమోదు చేసి నీరుగార్చారు.

అంతా కలెక్షన్..

లేదంటే రివర్స్ కేసు

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు మండలంలో అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలపై ఓ పోలీసు అధికారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులతో కుమ్మక్కై రూ.లక్షల్లో దండుకుంటూ కూటమి సానుభూతిపరులకు పట్టపగలే చుక్కలు చూపుతున్నారు. ఇక సాధారణ ప్రజల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. జేబునిండా డబ్బులుంటేనే తన వద్దకు రావాలని హుకుం జారీ చేస్తుండటంతో బాధితులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయమై నియోజకవర్గ, మండల నాయకులు ఆ శాఖ స్థానిక, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండటంలేదు. అతని వ్యవహారశైలి వివాదాస్పదమౌతున్నా జిల్లా ముఖ్య అధికారి శ్రీరామరక్షగా నిలుస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

వివాదాస్పదంగా పోలీస్ వ్యవహారం
కేసు కట్టాలంటే చేయి తడపాల్సిందే..
వైసీపీ నాయకులతో చెట్టపట్టాల్
వారు చెప్పినట్లే నడుస్తున్న తీరు
కేసులను నీరుగారుస్తున్న అధికారి
ఏకంగా అధికారపార్టీ వారికే చుక్కలు
ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనం
ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం

మార్కాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెద్దారవీడు మండలానికి చెందిన ఓ పోలీసు అధికారి తీరు విమర్శలకు దారితీస్తోంది. చట్టాన్ని తన చుట్టంగా చేసుకుని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులను ఏజెంట్లుగా పెట్టుకుని అక్రమ దందా సాగిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిని నానా దుర్భాషలాడటం, బెదిరించడం ఆనవాయితీగా చేసుకున్నారు. ఇప్పటికే పలువురు స్థానిక అధికారులు తీరు మార్చుకోమని మందలించినా ఎలాంటి మార్పులేకపోగా మరింతగా విజృంభించి చేతివాటం చూపుతూ కలెక్షన్ కింగ్‌గా మారిపోయారు. విసిగివేసారిన కొందరు మండల ప్రజలు డివిజన్, జిల్లా, రాష్ట్ర పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయం తెలిసిన ఆ అధికారి వారిపై కక్ష సాధింపు చర్యలకు కూడా పాల్పడుతున్నట్లు సమాచారం. ఆ శాఖకు చెందిన నిఘా విభాగం అధికారులు కూడా అతని వివాదాస్పద వైఖరిపై నివేదికలు పంపినా బుట్టదాఖలవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో జిల్లా ముఖ్య అధికారి వద్ద పనిచేసిన సాన్నిహిత్యం కాపాడుతున్నట్లు బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైసీపీ నాయకులతో అంటకాగుతున్న వైనం

● పెద్దారవీడు మండల కేంద్రానికి చెందిన ఓ వైసీపీ ప్రజాప్రతినిధి కుమారునితో సదరు అధికారికి మంచి స్నేహం నడుస్తోంది. ఈ క్రమంలోనే మండల కేంద్రంలో ఓ ప్రభుత్వ భవన నిర్మాణం వద్ద ఇసుక దొంగతనం చేసిన ప్రజాప్రతినిధి కుమారుడిని కాపాడేందుకు చట్టాన్ని కూడా నిర్వీర్యం చేశారు. బలమైన సాక్ష్యాలతో గృహ నిర్మాణశాఖ ఏఈ ఫిర్యాదు చేసినా నిందితుడికి అండగా నిలిచారు. సాక్ష్యాధారాలతో ఓ ప్రభుత్వ అధికారి ఫిర్యాదు చేసినా వెంటనే అరెస్ట్ చేయకుండా మిగతా 6లో...



మూసివేసి ఉన్న ఇష్టకామేశ్వరి దేవాలయ ప్రవేశ మార్గం

ఎకో టూరిజం, ఇష్టకామేశ్వరి దేవాలయ

దర్శనం నిలిపివేత

● రేంజ్ అధికారి జీవన్‌కుమార్

పెద్దదోర్నాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని ఎకో టూరిజం సందర్శన, ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనం మూడు నెలల పాటు నిలిపి వేయనున్నట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి జీవన్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి మిగతా 6లో...

పొగాకు బోర్డు ఆర్ఎంగా రామారావు

రేపు బాధ్యతల స్వీకరణ
ప్రస్తుత ఆర్ఎం ఉద్యోగ విరమణ
విజిలెన్స్ ఓఎస్డీగా ఒంగోలు-1 ఏఎస్ రవికాంత్



శీలం రామారావు (ఫైల్)

ఒంగోలు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ మేనేజర్‌గా శీలం రామారావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆయన పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయ పర్యవేక్షణలోని విజిలెన్స్ విభాగంలో ఓఎస్డీగా పనిచేస్తున్నారు. ఒంగోలు ఆర్ఎంగా పనిచేస్తున్న లక్ష్మణరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని 11వేలం కేంద్రాలు ఉండగా ఒంగోలు కేంద్రంగా రెండు రీజియన్లు పనిచేస్తున్నాయి. దక్షిణాది తేలిక నేలలు (ఎస్ఎల్ఎస్), దక్షిణాది నల్లనేలలు (ఎస్బీఎస్) రీజియన్లు ఉండగా గతంలో రెండు రీజియన్లకు విడివిడిగా ఆర్ఎంలు ఉండేవారు. అయితే పొగాకు బోర్డులో అధికారుల కొరత కారణంగా ఐదేళ్లగా ఒక ఆర్ఎం పర్యవేక్షణలోనే రెండు రీజియన్లు కొనసాగుతున్నాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన రామారావు పొగాకు బోర్డులో ఫీల్డ్ ఆఫీసర్‌గా చేరి సుదీర్ఘకాలం జిల్లాలో కూడా పనిచేశారు. ఫీల్డ్ ఆఫీసర్‌గా పలుచోట్ల పనిచేయడంతోపాటు కొండపి, టంగుటూరు-1 వేలం కేంద్రాల్లో ఆక్షన్ సూపరింటెండెంట్‌గా ఐదేళ్లు పనిచేశారు. అనంతరం విజిలెన్స్ విభాగంలో ఓఎస్డీగా గుంటూరు ప్రధాన కార్యాలయం నుంచి పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఒంగోలు ఆర్ఎంగా నియమితులైన రామారావు బుధవారం ఇక్కడ బాధ్యతలు తీసుకోనున్నారు. రామారావును ఇక్కడ ఆర్ఎంగా నియమించడంతో ఖాళీ అయిన విజిలెన్స్ ఓఎస్డీ పోస్టులో ప్రస్తుతం ఒంగోలు-1 వేలం కేంద్రం అధికారిగా పనిచేస్తున్న రవికాంత్‌ను నియమించారు. ఆయన స్థానంలో ఒంగోలు-1 వేలం కేంద్రం అధికారిగా ప్రస్తుతం అందులో సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్‌గా ఉన్న పాండేకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

● సచివాలయ ఉద్యోగులకు ఆర్డర్లు ఇచ్చేందుకు ఆయా శాఖల అధికారులు కసరత్తు
● అన్నిశాఖల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ సమాప్తం

ముగిసిన బదిలీలు



ఏఎన్ఎంలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సోమవారం ముగిసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీలు చేపట్టారు. బాపట్ల జిల్లా పరిధిలో చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ఉండగా, నెల్లూరు జిల్లా పరిధిలో కందుకూరు నియోజకవర్గం ఉంది. దీంతో ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల ఆయా శాఖల అధికారులను సచివాలయ ఉద్యోగుల బదిలీలను సమన్వయం చేసేందుకు జడ్పీ సీఈవో చిరంజీవికి ఆ బాధ్యతను అప్పగించారు. దీంతో ఆయన మూడు జిల్లాల పరిధిలోని అధికారులను సమన్వయం చేసి బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారు.

భారీగా కసరత్తు

జిల్లావ్యాప్తంగా వార్డు సచివాలయాల్లో 122 ఉండగా అందులో 1,058 మంది ఉద్యోగులు, 597 గ్రామ సచివాలయాల్లో 5,566 మంది పనిచేస్తున్నారు. దీంతో ఆ ఉద్యోగులందరినీ బదిలీ చేయాల్సి రావడంతో ఆయా శాఖల అధికారులు భారీ కసరత్తు చేశారు. సోమవారం వైద్యశాఖ పరిధిలో సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు ఈ ప్రక్రియ చేపట్టారు. అలా మిగిలిన శాఖల్లో అరకొరగా మిగిలిన ఉద్యోగుల కౌన్సెలింగ్‌ను పూర్తిచేశారు. ఇది సోమవారంతో ముగియడంతో ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టారు.

2.80 లక్షల మందికి నేడు పింఛన్ల పంపిణీ

రూ.123.01 కోట్లు విడుదల

ఒంగోలు నగరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద జిల్లాలోని లబ్ధిదారులకు నేడు సామాజిక పింఛన్ల పంపిణీ జరుగనుంది. ఉదయం 7 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 2,80,625 మంది పింఛన్‌దారులు ఉండగా వీరికి పంపిణీ కోసం ప్రభుత్వం రూ.123 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం సచివాలయాల వారీగా డిపాజిట్ చేయగా సిబ్బంది సోమవారం బ్యాంకుల నుంచి నగదును డ్రా చేశారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి టంగుటూరు మండలం పొందూరులో ఉదయం పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తారు. ఇక జిల్లాలోని 517 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పంపిణీ కార్యక్రమం జరగనుంది.

● **కొత్త పింఛన్ల పంపిణీ లేనట్లే**

భర్త చనిపోతే ఆ మరుసటి నెలలోనే భార్యకు పింఛన్ (స్పౌజ్ పింఛన్) పంపిణీ చేసే పింఛన్లు జూలైలోనూ వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గత నెలలో జిల్లాకు 3,499 కొత్త పింఛన్ల మంజూరు చేసింది. సచివాలయాల ద్వారా వీరి వివరాలను సేకరించి పింఛన్ మంజూరు చేస్తూ గత నెలలోనే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. వీరికి ఈనెల 12వ తేదీన పింఛన్లను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. స్పౌజ్ కేటగిరీ కింద మంజూరు చేసిన 3,499 పింఛన్లను జూన్ నెల ఒకటో తేదీనే అందరితో పాటు పింఛన్లును పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా జూన్ 12వ తేదీన కొత్తగా స్పౌజ్ కేటగిరీ కింద మంజూరు చేసిన పింఛన్లను పంపిణీ చేస్తామని ప్రకటించింది. అనివార్య కారణాల వల్ల 12వ తేదీన కూడా పంపిణీ చేయడం లేదంటూ ప్రభుత్వం ప్రకటించింది. జూలై ఒకటో తేదీన పింఛన్ సొమ్ము అందిస్తారని ఎదురుచూస్తున్న సమయంలో పాత వారికే పంపిణీ అంటూ సెర్ప్ కేంద్ర కార్యాలయం నుంచి డీఆర్డీఏ అధికారులకు సమాచారం అందింది. కొత్తవారికి ఎప్పుడు పంపిణీ చేయాలో అనే విషయాన్ని తర్వాత ప్రకటిస్తామని ప్రభుత్వం నుంచి సమాచారం అందటంతో పింఛన్ మంజూరై ఎదురుచూస్తున్న వారికి మళ్లీ నిరాశే మిగిలింది.

నేటి నుంచి రేషన్ పంపిణీ

మంగళవారం నుంచి రేషన్ పంపిణీ జరగనుంది. జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలు ఉండగా ఆయా డీలర్ల ద్వారా కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 6.61 లక్షల రేషన్ కార్డులుండగా అవసరమైన మేరకు బియ్యం, పంచదారను రేషన్ షాపులకు సరఫరా చేశారు. కార్డుదారులకు రేషన్‌షాపుల వద్దనే సరుకులు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



నత్తనడకన పీఎం జన్‌మన్

(5వపేజీ తరువాయి)

బిల్లుల చెల్లింపులో కూడా ప్రభుత్వం దృష్టిపెట్టి నిర్మాణాలు పూర్తిచేస్తే నల్లమల గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపినట్లు అవుతుందనడంలో సందేహం లేదు.

డివిజన్‌లో నిర్మాణం జరుగుతున్న గృహాల వివరాలు

మండలం	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తి	పనిదశల్లో..
దోర్నాల	24	22	8	0	0	122
పెద్దారవీడు	0	0	1	0	5	6
పుల్లలచెరువు	14	69	21	4	3	120
ఎర్రగొండపాలెం	46	7	9	7	5	105
అర్ధవీడు	20	31	0	0	0	18
గిద్దలూరు	0	4	0	0	0	1
మార్కాపురం	0	4	1	3	6	0

త్వరలోనే బిల్లులు వస్తాయి

గృహనిర్మాణాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నాం. నిర్మాణం జరిగిన అన్ని గృహాలను రికార్డుపరంగా పూర్తి చేశాం. బిల్లుల గురించి ఆందోళన అవసరం లేదు. త్వరలోనే బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ అవుతాయి.

- సురేష్ బాబు, హౌసింగ్ డీఈ, ఎర్రగొండపాలెం

అంతా కలెక్షన్..

(5వపేజీ తరువాయి)

యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకునే వరకు తాత్సారం చేశారు.

● దేవరాజుగట్టు వద్ద ఓ భూమి వ్యవహారంలో కూడా ప్రజాప్రతినిధి కుమారుడు ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేయించుకుని పట్టాదారునిపైనే అక్రమంగా అట్రాసిటీ ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై అత్యుత్సాహం చూపిన పోలీసు అధికారి రూ.లక్షల్లో డిమాండ్ చేసినట్లు విమర్శలు వచ్చాయి. బాధితుడు ఆధారాలతో రెవెన్యూ ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో వ్యవహారం సద్దుమణిగింది.

● మండలంలో శుభకార్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎలాంటివి జరిగినా భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు మండల ప్రజలు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

చేయి తడిపితేనే కేసులు

మండలంలోని మద్దలకట్ట పంచాయతీ పరిధిలోని మాచిరాజుకుంట గ్రామంలో టీడీపీ నాయకుడు కామేపల్లి వెంకటేశ్వర్లును అంతమొందించేందుకు ప్రతిపక్ష పార్టీ నాయకులు పొలంలోని పాకకు విద్యుత్ తీగలు తగిలించారు. అప్రమత్తమైన వెంకటేశ్వర్లు ఆ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ విషయమై తనకు ప్రాణహాని ఉందని పోలీసు అధికారిని ఆశ్రయిస్తే సీసీ కెమెరాలు పెట్టుకోకుండా తన దగ్గరికి వస్తే ఏమి చేయాలంటూ అసభ్య పదజాలంతో దూషించారు. తర్వాత కొద్దిరోజులకు వెంకటేశ్వర్లు పొలంలో బోరు మోటారును, పైప్‌లైన్‌లను వైసీపీ సానుభూతిపరులు ధ్వంసం చేశారు. మళ్లీ వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

● మండలంలోని పుచ్చకాయలపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు వీరారెడ్డిని అంతమొందించేందుకు సర్పంచ్ బంధువులు దాడి చేశారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసుకున్నా.. వైసీపీ నాయకులతో కుమ్మక్కై రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని చిన్నపాటి దాడిగా మార్చి కేసును నీరుగార్చారు. సర్పంచ్ బంధువులతో ఫిర్యాదు తీసుకుని బాధితుడు వీరారెడ్డిపై కూడా కేసు నమోదు చేయడం విశేషం.

● మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఓ వైసీపీ నాయకుడు ప్రభుత్వ వాగుపోరంబోకు భూమిలో అక్రమంగా కుంటను తవ్వి పొలానికి నీళ్లు పెట్టుకుంటున్నారు. ఈ కుంటలో పడి అదే గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. ఈ కేసులో వైసీపీ నాయకుని వద్ద పెద్దమొత్తంలో వసూలు చేసి కేసును నీరుగార్చినట్లు సమాచారం. అక్రమంగా కుంటను తవ్విన రైతు వద్ద నుంచి తమకు పరిహారం ఇప్పించమని బాధితులు ఆ అధికారిని కోరినా నానా దుర్భాషలాడినట్లు తెలిసింది.

ఎవరికి ఫిర్యాదు చేసినా మారని తీరు..

పోలీసు అధికారి తీరుపై మండలంలోని కొందరు తొలుత డివిజన్ స్థాయి అధికారి దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ స్థాయి అధికారి పద్ధతి మార్చుకోమని చెప్పి మందలించారు. తీరు మార్చుకోకపోగా మరింత రెచ్చిపోయి ఫిర్యాదుచేసిన వారిపై కక్షపూరితంగా వ్యవహరించడం మొదలుపెట్టారు. దీంతో విసిగివేసారిన అధికారపార్టీకి చెందిన మండల నాయకులు నియోజకవర్గ ముఖ్య నాయకునికి అన్ని విషయాలు తెలియజేశారు. సదరు నాయకుడు జిల్లా ఉన్నతాధికారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా ఏడాది కాకుండానే తాము బదిలీ చేయలేమని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మండల నాయకులు గుంటూరు ఐజీ, డీజీపీలకు 10 రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మండలానికి చెందిన పోలీసు అధికారి తీరుపై ఇప్పటికే నిఘా విభాగానికి చెందిన సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో విచారించి నివేదికను జిల్లా పోలీసు అధికారులకు పంపినట్లు సమాచారం. పోలీసుశాఖ ప్రతిష్ఠను అప్రతిష్ఠపాలు చేస్తున్న ఆ అధికారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని మండల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సత్కారం

ఒంగోలు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులను ఎస్పీ ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన కమ్యూనికేషన్ సీఐ జి.వెంకయ్య, ఎస్సైలు ఉన్నం సుబ్బారావు, షేక్ అమీర్, ఏఎస్సైలు పి.లక్ష్మణరావు, సయద్ రఫీ, ఎఆర్ఎస్సై సీహెచ్.బ్రహ్మానందంలను ఎస్పీ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణచేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ సీఐ దేవప్రభాకర్, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సై తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎస్పీ దామోదర్

రికార్డులు పక్కాగా నిర్వహించండి



రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ రామకోటయ్య

రాచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌లో కేసులకు సంబంధించి రికార్డులు పక్కాగా నిర్వహించాలని గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జే రామకోటయ్య అన్నారు. రాచర్ల పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల గురించి ఎస్సై కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్‌లో ఉంచొద్దని, ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అగ్నికుల క్షత్రియులకు అండగా ప్రజా ప్రభుత్వం



ఎమ్మెల్యే జనార్దన్ కలిసిన కార్పొరేషన్ చైర్మన్ పాపారావు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అగ్నికుల క్షత్రియులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, అలాగే ఆ సామాజిక వర్గ కార్పొరేషన్ చైర్మన్‌గా తాను అవసరమైన సహకారం అందిస్తానని ఆ సంఘం కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు పేర్కొన్నారు. సోమవారం ఒంగోలు విచ్చేసిన ఆయన స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులకు కూటమి ప్రభుత్వం అందజేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందేలా చూడాలని ఎమ్మెల్యేని కోరారు. అలాగే కొత్త కూరగాయల మార్కెట్‌లోని చేపల మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న వారికి అద్దెల విషయంలో రాయితీ కల్పించాలని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వెన్నుముకగా ఉన్న బీసీలకు తాను అన్ని వేళలా అండగా ఉంటానని అన్నారు. వారి సంక్షేమం కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో లైవ్‌స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్, పలువురు అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్యమం

మద్దిపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి):పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించేవరకు ఉద్యమం చేస్తామని పొగాకు రైతు సంఘ నాయకులు చుండూరి రంగారావు అన్నారు. సోమవారం వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపారుల సిండికేట్‌తో రైతులు కుదేలవుతున్నారని, రైతులు సంఘటితమై ఉద్యమం చేస్తేనే ప్రభుత్వాలు దిగివస్తాయని అన్నారు. పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ విజయశ్రీ పొగాకు కొనుగోలుపై పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ పొగాకు వేలం కేంద్రంలో రైతులు తెచ్చిన పొగాకును కుంటి సాకులతో వెనక్కి పంపటం దారుణమైన చర్యఅని అన్నారు. వెల్లంపల్లి వేలం కేంద్రం రైతు సంఘ అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు మాట్లాడుతూ రైతులు తెచ్చిన పొగాకును వెనక్కి తీసుకు వెళ్లకుండా వేలం అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో రావి ఉమామహేశ్వరరావు, గండ్ల వెంకటేశ్వర్లు, పావులూరి అంజయ్య, జజ్జర శరత్ బాబు, శ్రీనివాసరావు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎకో టూరిజం, ఇష్టకామేశ్వరి దేవాలయ దర్శనం నిలిపివేత

(5వపేజీ తరువాయి)

సెప్టెంబరు 30 వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందన్నారు. ప్రధానంగా నాగార్జునసాగర్ పులుల అభయారణ్యం పెద్ద పులులకు ఆవాసం. అయితే ఈ మూడు మాసాలు పులుల సంతానోత్పత్తికి అనువైన సమయం కావడంతో వాటికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు అటవీ శాఖాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని తుమ్మలబైలు వద్ద ప్రకృతి ప్రేమికుల కోసం ఏర్పాటు చేసిన ఎకో టూరిజం సందర్శనను మూడు నెలలు అనుమతించబోరు. శ్రీశైలం దగ్గరగా ఎర్రగొండపాలెం మండలంలోని నెక్కంటి రేంజ్ పరిధిలోని ఇష్ట కామేశ్వరి అమ్మవారి దర్శనం కూడా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రానా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.



- ఈ ఏడాది జనవరి 18న కొత్తపట్నంకు చెందిన ఓ మహిళ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు వెళ్లగా పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు మహిళకు పాంక్రియాటిక్ క్యాన్సర్‌గా గుర్తించారు. దీంతో శస్త్ర చికిత్స చేయడంతో ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగా ఉన్నారు.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో నాగులుప్పలపాడు మండలం, రావర్ల గ్రామానికి చెందిన బేల్దారీ మేస్త్రి ఐజాక్ కాళ్లు, చేతులు చచ్చుబడిపోయి పూర్తిగా అనారోగ్యానికి గురయ్యారు. వైద్యం కోసం పెద్దపెద్ద నగరాలలోని ఆసుపత్రుల్లో చూపించుకున్నా నయంకాలేదు. చావుబతుకుల మధ్య ఒంగోలు రిమ్స్‌కు రాగా, న్యూరాలజీ స్పెషలిస్టులు గోపీకృష్ణ, వలిలు బాధితుడు తలలో గడ్డను తొలగించారు. రోగి ప్రస్తుతం యథావిధిగా రోజువారీ పనులకు వెళుతూ, ఆరోగ్యంగా ఉన్నారు.
- గత నెల 13న చీమకుర్తికి చెందిన ప్రసాద్ గుండె సంబంధిత బాధతో రిమ్స్‌కు రాగా, ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి, కుడివైపు రక్తనాళంలో బ్లాక్ ఉండటంతో గుండె సంబంధిత స్పెషలిస్ట్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు నేతృత్వంలో యాంజియో ప్లాస్టి తీసి, రెండు బెలూన్లు వేసి, స్టంట్ వేయడంతో ప్రస్తుతం రోగి ఆనందంగా ఉన్నారు.

నేడు అంతర్జాతీయ డాక్టర్స్ దినోత్సవం

వైద్యులూ వందనం..!

కనిపించే దేవుళ్లుగా ప్రతి ఒక్కరి మనసులో స్థానం

ప్రభుత్వ వైద్యశాలల్లోనూ ఆధునిక శస్త్రచికిత్సలు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రాణం పోసేది బ్రహ్మ అయితే, పునర్జన్మని చ్చేది వైద్యులు. అందుకే వైద్యో నారాయణో హరి అంటారు. వైద్యుడు దేవుడుతో సమానం. కని పెంచిన తలిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పించే గురువు తర్వాత దేవుడిగా భావించేది వైద్యుడినే. ప్రపంచాన్నే తన గుప్పిట బంధించి మానవాళి మనుగడకే పెనుసవాల్ విసిరిన కరోనా వైరస్ మహమ్మారి నుంచి మానవాళిని వైద్యులు రక్షించారు. పగలు, రాత్రీ తేడా లేకుండా కష్టపడిన రోజులు ఇంకా మన కళ్ల ముందు కదిలాడుతూనే ఉన్నాయి. ఈ పోరాటంలో పలువురు వైద్యులు సైతం సమిధలుగా మారారు. కుల, మత, జాతి బేధాలు లేకుండా రోగి ప్రాణాలను కాపాడటమే తమ విధిగా నిరంతరం సేవలందిస్తున్న వైద్యులకు చేతులెత్తి నమస్కరించాల్సిందే. అన్నీ రంగాల్లోనూ సేవలు.. సెలవులు సహజం. అయితే వైద్య వృత్తి అనేది సెలవు లేని సేవాగుణం. అలాంటి వైద్యులకు ఓ రోజు ఉండటం అభినందనీయం. ఎందరో ప్రాణదాతలు.. వారందరికీ వందనం అంటున్నారు ప్రజానీకం. నేడు అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం




ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి ...

ఒకపుడు చేతి నాడి, నాలుక చూసి రోగం చెప్పడమే కాకుండా మందుబిళ్లలను ఇచ్చేసి రోగాన్ని నయం చేసే రోజుల నుంచి నేటి రాకెట్ యుగంలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఎంతటి రోగమ్మైనా పరీక్షించే యంత్రాలు అందుబాటులోకి రాగా, పాత, కొత్తతరం వైద్యులు ప్రజల ప్రాణాలను నిలబెట్టడమే లక్ష్యంగా.. ప్రతిక్షణం శ్రమించే వారు ఎందరో ఉన్నారు. వైద్య వృత్తికి న్యాయం చేస్తూ రోగికుటుంబానికి బంధువులుగా నిలుస్తున్నారు.

వైద్యుల దినోత్సవం ఎలా వచ్చిందంటే...

పశ్చిమబెంగాల్‌కు చెందిన డాక్టర్ బీసీ రాయ్ అందించిన వైద్య సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన పుట్టిన రోజైన జూలై 1న డాక్టర్ డే జరుపుకోవాలని ప్రకటించింది. ఆయన బెంగాల్ రెండో ముఖ్యమంత్రిగా పనిచేయడమేగాక చంద్రరాయ్ అనే వైద్య సంస్థల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. జాదవ్‌పూర్‌లో టీబీ ఆసుపత్రి, చిత్తరంజన్ సేవా సదన్, కమలా నెహ్రూ మెమోరియల్ ఆసుపత్రి, విక్టోరియా ఇనిస్టిట్యూట్, చిత్తరంజన్ క్యాన్సర్ ఆసుపత్రి, చిత్తరంజన్ సేవా సదన్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలన్నీ ఆయన హయాంలోనే పురుడుపోసుకున్నవే. మహిళలకు సామాజిక సేవ, నర్సింగ్‌లో శిక్షణ ఇప్పించడానికి ఆయన ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.



ఏమండీ ఒకవేళ నేను తప్పిపోతే మీరు ఏం చేస్తారని భార్య భర్తను అడిగింది. అదేంటి నువ్వు తప్పిపోతే నేను చూస్తూ ఊరుకుంటానా? టీవీల్లో, పేపర్లలో ప్రకటన ఇస్తా.. నువ్వు ఎక్కడ ఉన్నా సుఖంగా ఉండాలని! అంటూ సమాధానం చెప్పాడు భర్త. ఇలా భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, స్నేహితులు నిత్యం జోకులు వేసుకుని ఆనందంగా గడపటం మనం చూస్తుంటాం.

నేడు అంతర్జాతీయ జోక్స్ డే


ఆరోగ్యానికి నవ్వు మంచి టానిక్ అంటున్న వైద్యులు

అందుకే జోక్స్‌కు జీవితంలో ఎంతో ప్రాధాన్యం

నేడు అనేక టీవీల్లోనూ పలు కార్యక్రమాలు

నవ్వుతూ బతకాలిరా..!

ఒంగోలు కల్చరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : నవ్వటం ఒక యోగం.. నవ్వకపోవడం ఒక రోగం.. నవ్వించడం ఒక భోగం అంటాడు సినీ కవి జంధ్యాల. నవ్వటం ద్వారా ముఖంలోని కండరాలు సైతం బలపడతాయి. ఇటీవల కాలంలో నవ్వును కూడా మంచి వ్యాయామంగా గుర్తించారు. నవ్వు మనిషిలోని పిరికితనాన్ని పోగొడుతుందని మానసిక వైద్యులు చెబుతున్నారు. చిరునవ్వు, విరగబడి నవ్వటం, ముసిముసి నవ్వులు, చిన్నారుల బోసినవ్వులు ఇలా నవ్వటం ద్వారా మానసికంగా, శారీరకంగా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. మనస్ఫూర్తిగా నవ్వటం ద్వారా అధిక రక్తపోటు తగ్గుతుంది. అదేవిధంగా మన శరీరంలో రోగనిరోధక కణాలు పెరుగుతాయి. అటువంటి నవ్వుకు మంచి మార్గం జోక్. మనం ఎంత బాధలో ఉన్నా ఎదుటి వ్యక్తి మంచి జోక్ వేసినప్పుడు నవ్వు వస్తుంది. ఒక్కోసారి ఆ జోక్‌ను తర్వాత కూడా తలుచుకుని నవ్వుకుంటాం. జోక్‌కు అంత ప్రాధాన్యం ఉండడంతో టీవీ షోలు, స్టేజీ షోలు ప్రత్యేకంగా జోక్‌ల ఆధారంగా కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు. అటువంటి జోక్‌ల ప్రాధాన్యతను తెలియజెప్పటానికి ఏటా జూలై 1వ తేదీ అంతర్జాతీయ జోక్స్ దినంగా జరుపుకుంటారు. వేన్ రీనాగెల్ అనే అమెరికన్ రచయిత దీన్ని ప్రారంభించారు. కాలక్రమేణా జోక్స్ అనేక రూపాలలో వెలువడుతున్నాయి. కార్టూన్‌లు, మీమ్స్, రీల్స్, స్టాండప్ కామెడీలు ఇలా కనిపిస్తుంటాయి.



● ఒంగోలులో లాఫింగ్ క్లబ్

ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన లాఫింగ్ క్లబ్‌లో నెలకు ఒకసారైనా సభ్యులు కలుసుకుని సరదాగా జోక్స్ చెప్పుకూంటూ హాయిగా నవ్వుకుంటుంటారు. మన నిత్య జీవితంలో ఎన్ని బాధలు ఉన్నా ఒక్కసారి మనసారా నవ్వితే వాటిని తాత్కాలికంగా అయినా మర్చిపోగలుగుతాం. సో ఒక్కసారి ఏదైనా జోక్ వేసి లేదా చూసి హాయిగా నవ్వుదాం.. స్మైల్ ప్లీజ్.

మహిళా అధికారిని దుర్భాషలాడిన ఎక్సైజ్ ఎస్ఐ

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

ఒంగోలు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : పొదిలి ఎక్సైజ్ స్టేషన్‌లో మహిళా సీఐను ఓ ఎస్సై పరుషపదజాలంతో దుర్భాషలాడారు. బెల్ట్ షాపు నిర్వాహకుడి వ్యవహారంలో జరిగిన ఘటనే ఈ వివాదానికి కారణమ్మైంది. వివరాలలోకి వెళితే... మహిళా సీఐ అనుమతి లేకుండా ఆ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై ఆదివారం ఓ బెల్టు షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌లో బేరసారాలు చేసుకొని బెల్టు షాపు నిర్వాహకుడిని వదిలేశాడు. ఈ విషయం తెలుసుకున్న సీఐ సంబంధిత ఎస్ఐని పిలిచి ప్రశ్నించారు. తనకు తెలియకుండా రైడ్ చేయడమే కాకుండా, బెల్ట్ షాప్ నిర్వాహకుడిని ఎలా వదిలిపెట్టారని అడిగారు.ఎస్సై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళ అధికారిని అవమానించే విధంగా మాట్లాడారు. అంతే కాదు ఆమె కులాన్ని కించపరిచేలా దుర్భాషలాడినట్లు సమాచారం. ఆ తర్వాత సీఐ ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మాట్లాడిన తీరుతోపాటు క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరించిన పరిస్థితిని వివరించారు. సోమవారం ఒంగోలులో ఉన్న జిల్లా ఎక్సైజ్ అధికారి ఆయేషా బేగంను కలిసి ఎస్సైపై సీఐ ఫిర్యాదు చేశారు. సంబంధిత ఎస్సైని, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పిలిపించి వారి నుంచి రాతపూర్వకగా నివేదికలను తీసుకున్నారు. అదే సమయంలో ఇరువురు అధికారుల మధ్య రాజీ ప్రయత్నాలు చేసినా ఫలించలేదు.

విచారణ చేసి చర్యలు తీసుకుటాం

జిల్లా ఎక్సైజ్ అధికారి

పొదిలి ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగిన ఘటనపై అక్కడ పనిచేస్తున్న మహిళ సీఐ సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు విచారణ చేసి బాధ్యులైన వారి పై చర్యలు తీసుకుటాం. క్రమశిక్షణ రాహిత్యంగా ఎవరూ వ్యవహరించినా చర్యలు తప్పవు.

పాలిసెట్ వెబ్ ఆప్షన్లకు అంతరాయం

ఒంగోలు విద్య, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు కళాశాలలు, కోర్సులు ఎంపిక చేసుకోనే వెబ్ ఆప్షన్లకు అంతరాయం ఏర్పడింది. వెబ్ ఆప్షన్లు పెట్టుకొనేందుకు విద్యార్థులకు సోమవారం నుంచి తాజా షెడ్యూల్ ప్రకటిస్తూ పాలిసెట్ కన్వీనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నుంచి వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు సిద్ధమైన విద్యార్థులకు మొదటిరోజే సైట్ మొరాయించడంతో వారు నిరాశకు గురయ్యారు. కళాశాలలకు ఆఫీలియేషన్, సీట్ల ఖరారులో జాప్యం కావడంతో ఆప్షన్లను ఐదురోజులు వాయిదా వేసి సోమవారం నుంచి ప్రారంభించారు. మొదటిరోజే మళ్లీ అంతరాయం కలగడంపై వారు ఆందోళన చెందుతున్నారు. తాజా షెడ్యూల్ ప్రకారం జూన్ 30 నుంచి జూలై 1నుంచి 5తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. 6వ తేదీన ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం ఇచ్చారు. 9న సీట్లు కేటాయిస్తారు. 10నుంచి 14 వరకు విద్యార్థులు కళాశాలల్లో చేరేందుకు అవకాశం ఇచ్చారు. 10నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే అవి బహిర్గతం

వైసీపీ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు, బూచేపల్లి తదితరులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీపై జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా బాబుమోసాలపై దశలవారీగా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జూలై 4 నుంచి 12వ తేదీలోపు మొదటి విడత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వైసీపీ విడుదల చేసిన క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు చేసిన మోసాలన్నీ బయటకొస్తాయని, వాటిని ప్రజలకు వివరించాలని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీమంత్రులు ఆదిమూలపు సురేష్, నాగార్జున, వైపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్, నేతలు జేఆర్ సుదాకర్‌బాబు, అన్నా రాంబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, నారాయణ, చుండూరి రవిబాబు, కే కనకారావు, కఠారి శంకర్ ఉన్నారు. అంతకు ముందు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తల్లికి వందనం పెండింగ్ ఈకేవైసీని నేటితో పూర్తిచేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

8న 750 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు ఇరువురు మంత్రులు రాక



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న తల్లికివందనంలో భాగంగా పెండింగ్ ఈకేవైసీని మంగళవారం సాయంత్రంలోపు పూర్తిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలతో సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. అర్హులందరికీ ఈ పథకం కింద ప్రయోజనం దక్కడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈకేవైసీ పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని చెప్పారు. ఈనెల 5వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. పీ-4పథకంలో భాగంగా బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించాలని, అదే సమయంలో వీటికి అండగా నిలిచేలా మార్గదర్శకులను కూడా గుర్తించాలని చెప్పారు. ఫారంపాండ్స్, ఫిషింగ్ పాండ్స్, కంపోస్టు పిట్స్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జూలై 8న రాష్ట్ర వ్యాప్తంగా పదివేల ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, అందులో భాగంగా జిల్లాలో 750 ఎకరాలలో మొక్కలు నాటాలని చెప్పారు. ఆ రోజున ఈ కార్యక్రమానికి జిల్లాఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్రసాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి సమక్షంలో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జూలైలో ఉపాధి పథకం కింద 20 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సగటు వేతనం రూ.251 లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అదికారులు చిరంజీవి, జోసఫ్‌కుమార్, శ్రీనివాసప్రసాద్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం మండలాన్ని మార్కాపురం డివిజన్‌లో విలీనం చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రామిరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లాలోని శ్రీశైలం మండలాన్ని మార్కాపురం డివిజన్‌లో విలీనం చేయాలని టీడీపీ పోల్ మేనేజిమెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, పాస్ సంస్థ నాయకులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన ఎన్నికల వాగ్దానం మేరకు నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా మార్కాపురం జిల్లాగా చేయనున్నారని తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు, ప్రజల ఆకాంక్షలు రోజువారీ అవసరాల కోసం నంద్యాల జిల్లా ఆత్మకూరు డీఎఫ్‌వో పరిధిలో ఉన్న శ్రీశైలం, సున్నిపెంట, ఫారెస్ట్ బీట్‌లను మార్కాపురం డీఎఫ్‌వో కార్యాలయంలో విలీనం చేయాలన్నారు. రోళ్లపెంట నుంచి శ్రీశైలం శిఖరం వరకు ఉన్న అటవీ ప్రాంతం మార్కాపురం డీఎఫ్‌వో పరిధిలో ఉందని, మిగిలిన కొంత ప్రాంతం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఉండిపోయిందని తెలిపారు. మార్కాపురానికి 80కి.మీ. దూరంలో ఉన్న శ్రీశైలంకు అనేక రకాల సంబంధాలు విద్యా, వైద్యం, పండ్లు, కూరగాయాలు, నిత్యావసర వస్తువులు ఇంకా అనేక వ్యాపారాలు ఇక్కడ నుంచే జరుగుతుంటాయని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలు కూడా ముడిపడి ఉన్నాయన్నారు. జల వనరులకు సంబంధించి వివాదాలు తలెత్తకుండా వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీశైలం మండలాన్ని కొల్లం వాగు పరిసరాలను మార్కాపురం డివిజన్‌లో కలిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ సంస్థ అధ్యక్షులు గాయం వెంకట నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, బొగ్గు శేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, చలువాది వెంకటేశ్వర్లు, జంకె వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వభూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

219, 217 సర్వే నెంబర్లలో ఉన్నది

ప్రభుత్వ భూమే : తహసీల్దార్



హెచ్చరిక బోర్డ్‌ను ఏర్పాటు చేస్తున్న వీఆర్వో

పొదిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. మండలంలోని పొదిలి గ్రామ సర్వే నెంబరు 219-2లో 1.86 సెంట్లు ప్రభుత్వ (గయాల)గా ఉంది. ఈభూమి ఎవరి ఆధీనంలో లేదు. ప్రభుత్వ పరిధిలో ఉంది. దీనిని ఎవరైనా ఆక్రమించినా, ఆక్రమించేందుకు ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ బోర్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే సర్వే నెంబరు 217లో 3.06 సెంట్ల కుంటబోరంబోకు భూమిలో ఎలాంటి నిర్మాణాలు, ఆక్రమణలు చేసినా చర్యలు తప్పవన్నారు. ఈ రెండు సర్వే నెంబర్లలో ఆక్రమణలు చేసి ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అభివృద్ధిని ప్రజలకు చెప్పాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో టీడీపీ సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి చెప్పాలన్నారు. ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, పుల్లలచెరువు మండల అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు శనగా నారాయణరెడ్డి సుబ్బారెడ్డి, టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, గాలెయ్య, షేక్ మాబు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 19వేల మందికి 'తల్లికి వందనం'

ఒంగోలు విద్య, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 19వేల మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. అడ్మిషన్లు సోమవారంతో ముగిశాయి. యూనిఫైడ్ డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆన్ స్కూలు ఎడ్యుకేషన్ ప్లస్(యూడైస్ ప్లస్)లో నమోదైన విద్యార్థులను మాత్రమే తల్లికి వందనం అమలుకు పరిగణనలోకి తీసుకుంటారు. యూడైస్ ప్లస్‌లో నమోదైన వివరాల మేరకు మొదటి సంవత్సరంలో 19వేల మంది చేరారు. ప్రభుత్వం మొదటి విడతలో తల్లికి వందనం విడుదల సమయంలోనే ప్రభుత్వం జూన్ 30 వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, 1వ తరగతిలో చేరిన విద్యార్థులకు జూలై 5న నాటికి తల్లికివందనం నిధులు తల్లుల ఖాతాలకు జమ చేయనున్నట్లు ప్రకటించారు.

నేడు, రేపు కూడా మెగా డీఎస్సీ పరీక్షలు

ఒంగోలు విద్య, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు మంగళ, బుధవారాల్లో కూడా జరగనున్నాయి. అంతర్జాతీయయోగా దినోత్సవ సందర్భంగా జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షలను జూలై 1, 2తేదీలకు వాయిదావేశారు. ఈ మేరకు ఈ రెండు రోజుల పరీలకు అభ్యర్థులకు ప్రత్యేకంగా హాల్ టికెట్లు కూడడా ముద్రించారు. సోమవారం ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థలో ఉదయం సెషన్‌లోనే పరీక్ష జరిగింది. స్కూలు అసిస్టెంట్ తెలుగు పరీక్షకు 10 మంది కేటాయించగా 8మంది మాత్రమే రాశారు.

అవీ..ఇవీ

గ్రానైట్ ఫ్యాక్టరీలో గాలులకు విరిగిపడిన క్రేన్లు

● లక్షల్లో ఆస్తినష్టం

చీమకుర్తి,జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ ప్రాంతంలో ఆదివారం రాత్రి వర్షం,బలమైన పెను గాలులు వీచాయి.దీంతో ఇక్కడ ఉన్న స్టోన్‌మార్ట్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ అనే గ్రానైట్ ఫ్యాక్టరీతో పాటు పలు ఫ్యాక్టరీలకు లక్షల్లో ఆస్తినష్టం చోటుచేసుకుంది. పెనుగాలులు ధాటికి ఫ్యాక్టరీల్లో రాళ్ల లోడింగ్ అన్‌లోడింగ్‌కు ఉపకరించే దాదాపు రూ.50 లక్షలు విలువచేసే గ్యాంట్రిక్ క్రేన్లు విరిగిపడి కుప్పకూలిపోయాయి.దీంతో పలు ఫ్యాక్టరీలలో కార్యకలాపాలు స్తంభించాయి.


స్టోన్‌మార్ట్ గ్రానైట్ ఫ్యాక్టరీలో విరిగిపడిన క్రేన్లు

విద్యార్థులకు పుస్తకాల అందజేత

నాగులుప్పలపాడు, జూన్30 (ఆంధ్రజ్యోతి): బి.నిడమానూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మారెళ్ల శ్రీనివాసరావు మాతృమూర్తి విజయలక్ష్మి 29 వ వర్ధంతి సందర్భంగా మారెళ్ల విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలోని వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు రూ. 50,000 విలువ గల నోట్‌బుక్‌లను తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారెళ్ల విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంకిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బి.శ్రీనివాసరావు, లక్కంతోటి విజయకుమార్, మణికంఠ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

అన్నదానం ఎంతో ఉత్తమం

ఒంగోలు నగరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):పేదలు, అనాథల ఆకలితీర్చే అన్నదానం అన్ని దానాలలో కెల్లా ఎంతో ఉత్తమమైనదని ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ అన్నారు. భగీరథ కెమికల్స్ అధినేత లింగమనేని వెంకట్రామయ్య జన్మదినం సందర్భంగా స్థానిక అన్నవరప్పాడులోని శివం శరణాలయంలో అనాథలు, పేదలకు సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శరణాలయం, రిమ్స్ ఆస్పత్రిలో 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, వెంకట్రామయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు .


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

ఒంగోలు రూరల్,జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ఏళ్లతరబడి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలందకీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎల్‌పీ నాయకులు దాసరి సంగీతరావు, వెంకటేశ్వర్లు, బేరగ రవికుమారి, ప్రేమలత, కే లీలావతి, దాసరి కీర్తి, పి. అంకమ్మ, దాసరి కృష్ణవేణి, అరుణ, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

కార్మికులకు రోజువారీ వేతనం నిర్ణయం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రోజువారి ఉద్యోగులకు వేతనాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్ణయించారని ఉప కార్మిక కమిషనర్ ఎ. గాయత్రిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ స్కిల్డ్‌కింద రూ. 694, సెమిస్కిల్డ్‌కింద రూ. 791, స్కిల్డ్ కింద రూ. 899, హై స్కిల్డ్‌కింద రూ. 1042గా నిర్ణయించారన్నారు. పెరిగిన వేతనాలు ఈ ఏడాది ఏప్రిల్ 1వతేదీ నుంచి వర్తిస్తాయని తెలిపారు. రోజువారీ ఉద్యోగులు ఈవేతనాలను వినియోగించుకోవాలని గాయత్రిదేవి కోరారు.

రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్ ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ శరత్ చౌదరీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీచ్ క్లీనింగ్, మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌లు పంపిణీ, అలాగే కెరీర్ గైడెన్స్ చార్ట్, క్యాన్సర్ రోగులకు మనో ధైర్యం కల్పించే అవగాహన కార్యక్రమాలు, ఆడపిల్లలకు విద్య ప్రాధాన్యతపై సెమినార్‌లు, ఎంపవర్డ్ ఉమెన్, అలాగే దివ్యాంగులకు వీల్ ఛైర్స్ బహూకరణతోపాటు, వివిధ సేవా కార్యక్రమాలలో రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్ చురుగ్గా పాల్గొనడంపై అవార్డులు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలు ఈ అవార్డులకు పోటీ పడగా, రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్‌కు లభించింది. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు బండారు లక్ష్మీనారాయణ, సురేంద్ర బాబు, కోగంటి గోపాల కృష్ణ, రావిపాటి శ్రీనివాసరావు, గుమ్మడి శ్రీధర్‌లకు అవార్డును అందజేశారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే అర్జీలకు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఆయా అర్జీల సమస్యలపై కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్దీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చే అర్జీలను సంబంధితశాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా అర్జీల పరిష్కార విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, శ్రీధర్, జాన్సన్, పార్థసారథితో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.


సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారు సమస్యను వింటున్న కలెక్టర్ అన్సారియా

మోసం చేశారని ఎస్పీకి ఫిర్యాదులు

ఒంగోలు క్రైం,జూన్29(ఆంధ్రజ్యోతి): కష్టపడకుండా డబ్బు సంపాదించాలని అనేక మంది మోసాలకు పాల్పడుతున్నారు.సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 83 మంది తమ సమస్యలను ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు విన్నవించుకున్నారు. వీటిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేయడం, కుటుంబ కలహాలకు సంబంధించి అధికంగా ఫిర్యాదులు అందాయి.

● బంగారు నక్లెస్ చేయిస్తానని తన వద్ద రూ 1.77 లక్షల నగదు సంతనూతలపాడుకు చెందిన వ్యక్తి తీసుకొని మోసం చేసాడని ఓ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

● ప్రభుత్వ రుణం ఇప్పిస్తామని చెప్పి ఒంగోలు మామిడి పాలెంకు చెందిన వ్యక్తి రూ.3లక్షలు తీసుకున్నాడని,రుణం ఇప్పించక పోగా తీసుకున్న నగదు తిరిగి ఇవ్వలేదని ఎస్పీకి విన్నవించారు.

ఇలా అనేక మంది తాము మోసపోయామని ఫిర్యాదులు చేయడంతో ఎస్పీ వారి సమస్యలు స్వయంగా విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐలు దుర్గాప్రసాద్, షమీముల్లా, పాండురంగారావు, ఎస్సై జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్



సార్వత్రిక సమ్మెపై సమావేశమైన కార్మిక సంఘాలు

సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్స్‌రద్దు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పలువురు కోరారు. స్థానికమల్లయ్యలింగం భవన్‌లో సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మికసంఘాల ఐక్యవేదిక సమావేశానికి కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను తెస్తుందని మండిపడ్డారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఉద్యోగ, కార్మికులను రెగ్యూలర్ చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తింపు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని,ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయకుండా నిలుపుదల చేయాలని తదితర డిమాండ్లతో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందన్నారు. ఈసమ్మెలో అన్ని వర్గాల ప్రజలతో పాటు కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జి. శ్రీనివాసులు, పమిడి వెంకట్రావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పి. హనుమంతరావు, సీహెచ్‌పద్మ, చుంచు శేషయ్య, సుబ్బారావు, ఎంఎస్ సాయి తదితరులు ఉన్నారు.

విలువలకు నిలువుటద్దం అనంతలక్ష్మి

ఒంగోలు విద్య, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : విలువలను పాటిస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన తన సోదరి, బోటనీ అధ్యాపకురాలు డోలా అనంతలక్ష్మి అందరికి ఆదర్శప్రాయురాలని మంత్రి డాక్టర్ స్వామి అన్నారు. అనంతలక్ష్మి ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థినులు విలువలు పాటిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అభిలషించారు. అనంతలక్ష్మి సోదరి పద్మావతి కూడా మాట్లాడారు. అలాగే కళాశాలలో సోమవారం ఉద్యోగ విమరణ చేసిన పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు చెన్నమనేని వెంకటేశ్వర్లు, ఆఫీసు సబార్డినేట్ వరలక్ష్మీలను కూడా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి. కల్యాణి, తెలుగు అధ్యాపకురాలు యామిని అమ్మాజీ, బి. కళ్యాణి, సీహెచ్ శ్రీనివాసరావు, సులక్షణ తదితరులు ఉన్నారు. ఉద్యోగవిమరణ చేసిన వారందరిని మంత్రి స్వామి ఘనంగా సన్మానించారు.


అధ్యాపకురాలు, సోదరి అయిన అనంతలక్ష్మి ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్న మంత్రి స్వామి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మద్దిపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి):యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మల్లవరం యూపీ స్కూల్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర రావు అన్నారు. సోమవారం మల్లవరం యుపి స్కూల్‌లో నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒత్తిడితో కూడిన జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తప్పనిసరిగా యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకమిషన్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాలు చేర్పులు, మార్పులు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోనే విధంగా పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఓటుకు ఆధార్‌అనుసంధానం కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధనరెడ్డి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు ఎస్, జాన్సన్, కుమార్, వరకుమార్, ఎంవీ సత్యనారాయణ, కే రవీంద్రారెడ్డి, ఎన్నికల సెల్‌సూపరిటెండెంట్ రాజ్యలక్ష్మి, ఒంగోలు తహసీల్దార్ మధుసూదన్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు ఎస్‌కే రసూల్, రమేష్, డీఎస్ క్రాంతికుమార్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

● ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

చీమకుర్తి,జూన్30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే విధంగా మార్పులు చేపట్టడం సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు.చీమకుర్తి పట్టణంలో 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, గాంధీనగర్, క్రిస్టియన్ పాలెంలో 100 కేవీ ఇంప్రూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం సాయంత్రం బీఎన్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణలు చేపట్టి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయటం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఈ మాకినేని హరిబాబు, ఏడీఈ మోహనరావు, ఏఈలు చంద్రశేఖర్,శ్రీనివాసరావులు టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్,ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు, గొల్లపూడి కోటేశ్వరరావు, కందిమళ్ల గంగాధరరావు, తాతినేని రాము, నర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఆర్‌పీలకు ట్యాబులు పంపిణీ

చీమకుర్తి మున్సిపాల్టి పరిధిలో మెప్మా ఆర్‌పీలకు ట్యాబుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదమహిళలు ఆర్థికంగా ఎదిగేవిధంగా ఆర్‌పీలు సహకారం అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో మహిళా దొంగల హల్‌చల్

వెల్డింగ్ దుకాణంలో ఇనుప వస్తువులు చోరీ

అడ్డుకున్న వ్యక్తిపై దాడి

నాగులుప్పలపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇనుప సామాన్లు చోరీకి పాల్పడిన మహిళా దొంగలను అడ్డుకొన్న వ్యక్తిపై దాడికి తెగబడ్డారు. తీవ్రంగా గాయపరిచారు. సమాచారం అందుకొన్న పోలీసులు మహిళా దొంగలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వేటపాలెంకు చెందిన తల్లి,కుమార్తెలైన దేవర కోటమ్మ, పెదాల లక్ష్మి సోమవారం తెల్లవారుజామున ఉప్పుగుండూరు గ్రామంలోని పోలేరమ్మ దేవాలయం వద్దనున్న ఓ వెల్డింగ్ దుకాణంలో ట్రాక్టర్ సామాన్లు చోరీ చేసి తరలిస్తున్న క్రమంలో అడ్డుకొన్న గ్రామానికి చెందిన గోగినేని కృష్ణపై దాడికి పాల్పడ్డారు. దాంతో కృష్ణ కాలికి సైతం గాయమయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకొని మహిళా దొంగల వద్దనున్న పెద్దసైజు గోతాలను తనిఖీ చేయగా ట్రాక్టర్ ట్రక్కు తగిలించే ఇచ్చితో పాటుగా మరికొన్ని ఇనుప వస్తువులు లభించాయి. దీంతో వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. మహిళా దొంగల్లో ఒకరైన లక్ష్మీ భర్త గోపి కూడా చోరుడిగా పోలీసులు గుర్తించారు.

పట్టుబడిన ఇద్దరు మహిళా దొంగలు గ్రామాలలో చోరీ చేసిన సామాన్లను ఒక చోట ఉంచి ఊరిబయట ఆటోలో వేచిఉన్న గోపీకి ఫోన్‌లో సమాచారం అందించి ఆఆటోలోనే వేసుకొని ఉడాయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.


వ్యక్తిపై మహిళా దొంగలు దాడి చేయడంతో అయిన రక్తగాయం

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

ఒంగోలు క్రైం,జూన్29(ఆంధ్రజ్యోతి):ఉరివేసుకొని కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం చేశాడు.ఈ సంఘటన చెరువుకొమ్ముపాలెంలో జరిగింది. పీసీఆర్‌లో పనిచేస్తున్న పి.శ్రీకాంత్ అనే కానిస్టేబుల్ కోళ్ల ఫారంలో తాడుతో ఉరి వేసుకొన్నాడు. సమాచారం తెలుసుకున్న భార్య ద్రాక్షవలి అక్కడుకు వచ్చి తాడును చాకుతో కోసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వివరాలలోకి వెళితే.. శ్రీకాంత్ అపుల బాధతో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చెబుతున్నారు. నెల రోజులుగా విధులకు గైర్హాజరవుతున్న శ్రీకాంత్ ఆత్మహతాయత్నం చేశాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. ఒకరు ఒంగోలు గద్దల గుంటలో ఉంటారు. మరొకరు ఆయన స్వగృహం అయిన మద్దిపాడు మండలం రాచవారిపాలెంలో ఉంటారు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన శ్రీకాంత్ అప్పులు బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు గుర్తించారు. అయితే చావుబతుకుల మధ్య ఉన్న శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ అధికారికి ఘనంగా వీడ్కోలు

మద్దిపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న కె.రమేష్ బాబుకు సోమవారం వీఏఏలు, డీలర్లు, రైతులు ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు మంచి సలహాలు, సూచనలు అందించిన అధికారి రమేష్‌బాబు అని అన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

ఒంగోలు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి నల్లగొర్ల శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక మండలపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో ఎంపీడీవో కే రాజశేఖరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ. బాలచెన్నయ్యతో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

స్మార్ట్ సిటీస్ అధికారులతో మాగుంట భేటీ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోక్‌సభ సభ్యుడు, స్మార్ట్ సిటీస్ మిషన్ కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా స్మార్ట్ సిటీస్ మిషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించి దిశా నిర్దేశంచేశారు. ఈ సమావేశంలో ఇతర కమిటీ సభ్యులు కూడా ఉన్నారు.



శ్వేత వారాహి అలంకరణలో జగదాంబ

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో వారాహి నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వేలూరి ఆంజనేయ శర్మ, వరుణ్ తేజ శర్మ జగదాంబ మాత మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం జగదాంబ మాత ఉత్సవమూర్తికి ఐదోరోజు శ్వేత వారాహి అలంకారం నిర్వహించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళిక

» సీఎం చంద్రబాబు హామీ
» మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మున్సిపాలిటీ అభివృద్ధికి పక్కాప్రణాళికతో ముందుకు పోతున్నామని, ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విధాలుగా సహకరించనున్నారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణానికి శాశ్వత మంచినీటి పరిష్కారం కొరకు చోళ్లవీడు సమీపంలో గల రామన్నకతువ నుంచి గిద్దలూరు పట్టణానికి నీటిని అందించేందుకు సుమారు రూ.170కోట్ల ప్రభుత్వం నిధులు కేటాయించనున్నదని, ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదించినట్లు తెలిపారు. తద్వారా పట్టణంలో నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. రూ.38 కోట్లతో పట్టణంలోని సగిలేరువాగుకు రివిట్‌మెంట్ వాల్ నిర్మించనున్నట్లు, అంతేకాక నీటి నిలువ, భూగర్భజలాల పెంపు కోసం చెక్‌డ్యాంల నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చినట్లు సమావేశంలో ఎమ్మెల్యే తెలిపారు. అంతేకాక పట్టణాభివృద్ధి కోసం అధికారులు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ రమణబాబు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



మున్సిపాలిటి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు చెప్పండి

» ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి » 4న మంత్రి గొట్టిపాటి పర్యటన

గిద్దలూరు టౌన్ : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను శ్రేణులు ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం గిద్దలూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో 6 మండలాల ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు జూలై 2న శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రతి టీడీపీ కార్యకర్త పాల్గొనాలన్నారు. అలాగే ప్రతిపక్షం చేసే తప్పుడు ప్రచారాలు కూడా తిప్పి కొట్టాలన్నారు. 4వ తేదీన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గిద్దలూరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు, కే యోగానంద్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆంజనేయులు, షానేషావలి, టీడీపీ నాయకులు పూనూరి భూపాల్‌రెడ్డి, కేతం శ్రీను, బైలడుగు బాలయ్య పాల్గొన్నారు.



వంట గదిని ప్రారంభిస్తున్న రామిరెడ్డి, ఉపాధ్యాయులు

సొంత నిధులతో వంటశాల నిర్మాణం

ఉపాధ్యాయుడిని అభినందించిన టీడీపీ నేత రామిరెడ్డి

మార్కాపురం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సొంత నిధులతో పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు వంట గది నిర్మించడం అభినందనీయమని టీడీపీ నేత కందుల రామిరెడ్డి అన్నారు. మండలంలోని బోడపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తన సొంత నిధులు సుమారు రూ.లక్షతో నిర్మించిన వంట గదిని కందుల రామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కందుల రామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంతోపాటు వారికి వసతులను కల్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రధానోపాధ్యాయులు జాకబ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం పరితపిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సేవలు అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ బోడపాడు పాఠశాలలో మెరుగైన విద్యను, వసతులను కల్పించడంలో రాజీపడేది లేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేఖ, రవి, వలంటీర్ టీచర్ హనుమంతు, టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, గొలమారు మహేశ్వరరెడ్డి, టీడీపీ బోడపాడు గ్రామ నాయకుడు బొగ్గు శేఖర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రంగనాయకులు, నారాయణరెడ్డి, డీలర్ గంగిరెడ్డి రామక్రిష్ణారెడ్డి, చైతన్యరెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, సాదుల శేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి స్థలం కేటాయించాలి

అర్ధవీడు (కంభం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అర్ధవీడువీడు పట్టణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రహం సోమవారం స్పందనలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అందరూ సుముఖంగా ఉన్నారని, స్థలం చూపించాలని కోరగా తహసీల్దార్ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

నిబంధనలను అతిక్రమిస్తే కేసులు

రాచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని రాచర్ల ఎస్ఐ పీ కోటేశ్వరరావు అన్నారు. పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలకు జరిమానా విధించారు. వాహనదారులు సరైన పత్రాలతో వాహనాలు నడపాలన్నారు. తనిఖీల సమయాల్లో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని కోరతూ మార్కాపురం మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం పెంచాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబానికి రూ.2లక్షలు చెల్లించాలన్నారు. రిటైర్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సుబ్బరాయుడు, గొట్టం హరికృష్ణ, షేక్ ఇమాంసా, పఠాన్ సలాంఖాన్, కనకయ్య, కేశవ, శేఖర్ పాల్గొన్నారు.

లారీని ఢీకొని మోటార్ సైక్లిస్ట్ మృతి

బేస్తవారపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట జాతీయ రహదారిలో ఆగిఉన్న లారీని ఢీకొట్టి మట్టిమల్ల చిన్న రంగయ్య(58) మృతి చెందారు. మేఘన రెస్టారెంట్ సమీపంలోని శివ వైన్స్ షాపు వద్ద బంకు పెట్టుకొని జీవనం సాగిస్తున్న చిన్న రంగయ్య ఆదివారం రాత్రి మోటార్‌సైకిల్‌పై వెళ్తూ లారీ వెనుక భాగాన్ని ఢీకొన్నాడు. గాయపడిన ఆయన్ని కంభం వైద్యశాలకు తరలించగా, చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తీసుకువెళ్లగా మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి తెలిపారు.

ఆశా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పొదిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలపాడు గ్రామ సచివాలయంలోని పోతవరం ఆశా కార్యకర్తగా పని చేయుటకు ఆసక్తి కలిగిన వారు జూలై 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పట్టణ మెడికల్ ఆఫీసర్ శరత్‌చంద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. అర్హతగలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు, సంబంధిత వార్డుల్లో నివాసం కలిగి ఉండి వివాహితై ఉండాలని తెలిపారు. వితంతువులు, విడాకులు పొందిన, భర్త నుంచి విడిపోయి లేదా నిరక్ష్యరాస్యురాలైన మహిళలలకు ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. పదవతరగతి ఉతీర్ణులై ఉండాలన్నారు. కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుతోపాటు తహసీల్దార్ ద్వారా ధ్రువీకరించిన నివాస ధ్రువీకరణపత్రం, రేషన్, ఆధార్, ఓటర్ కార్డు, బ్యాంకు పాసుబుక్ జత చేయాలన్నారు.

నేడు పింఛన్‌ల పంపిణీ

రాచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల పంపిణీ మంగళవారం ఉదయం 6గంటలకే ప్రారంభమవుతుందని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి తెలిపారు. పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది 5గంటలకే గ్రామాలకు చేరుకోవాలని, 6గంటల నుంచి పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టాలన్నారు. సిబ్బంది పింఛన్ల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.



అమ్మవారికి సారె తీసుకుని వెళ్తున్న మహిళలు

సామూహిక కుంకుమ పూజలు

గిద్దలూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆషాడమాస పూజలను వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిశాల నుంచి మేళతాళాల మధ్య ఆర్యవైశ్య మహిళలు శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లి వెలసి ఉన్న పార్వతిమాతకు సారె పెట్టారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సామూహికంగా జరిగిన కుంకుమ పూజ కార్యక్రమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. వాసవీ మహిళ మండలి అధ్యక్షురాలు బాదం పుష్ప, కమిటీ ప్రతినిధులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

గిద్దలూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులో ఆగస్టు 9, 10 తేదిలలో జరుగనున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జేవీవీ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. స్ప్రింగ్ బోర్డు హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో జేవీవీ నాయకులు హాజరై మాట్లాడుతూ గత 38 ఏళ్లుగా శాస్త్రీయ సమాజం ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తున్నామని, ప్రజల్లో మూఢనమ్మకాలను నిరోధించేందుకు సైన్స్, శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాప్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా మహాసభలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లాశాఖ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్వరూపారెడ్డి, జేవీవీ నాయకులు రమణయ్య, విశ్వరూపం పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారిగా మొయినుద్దీన్

రాచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండల-1 విద్యాశాఖ అధికారిగా షేక్ మొయినుద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కంభం మండలం తురిమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఉద్యోగోన్నతి పొంది రాచర్ల-1 విద్యాశాఖ అధికారిగా వచ్చింది. ఇక్కడ పనిచేస్తున్న ఏ శివ కోటేశ్వరరావు పర్చూరు మండలం వీరన్నపాలెం జడ్పీహెచ్ఎస్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో మొయినుద్దీన్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి, రాచర్ల-2 విద్యాశాఖ అధికారి గిరిధర శర్మ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. బదిలీ పై వెళ్లిన కోటేశ్వరరావుకు వీడ్కోలు పలికారు.

జాబ్‌మేళాలో 74 మంది ఎంపిక

గిద్దలూరు టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయి చైతన్య డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో ఇటువంటి జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న నిర్వాహకులు అభినందనీయలన్నారు. జాబ్‌మేళాలో టెక్‌మహీంద్ర, ఫ్యూచర్స్ ఐటీ సొల్యూషన్, ఎల్ఎన్‌టీ ఫైనాన్స్, గ్రీనెటెక్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ కార్డ్స్, పేటీఎం తదితర 16 కంపెనీలు పాల్గొన్నాయి. జాబ్‌మేళాలో 120 మంది నిరుద్యోగులు పాల్గొనగా, 74 మంది ఎంపికైనట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ రవితేజయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో సాయిచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపవరం రంగస్వామిరెడ్డి, నందన్, బాషా పాల్గొన్నారు.

సొంత నిధులతో చిల్లచెట్ల తొలగింపు

తర్లుపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవ చేయడమే లక్ష్యంగా ఉపాధ్యాయుడు కళ్ళెట్టి జగన్‌బాబు పనిచేస్తున్నారని పలువురు కొనియాడారు. మండలంలోని తుమ్మలచెరువు రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లతో మూసుకుపోయింది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రసిద్ధి గాంచిన తుమ్మలచెరువు మొహర్రం వేడుకలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఈ రోడ్డు మీదుగానే ప్రయాణించాల్సి ఉంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవటంతో దీంతో జగన్‌బాబు తర్లుపాడు నుంచి తుమ్మలచెరువుకు 7కి.మీ. దూరం ఉన్న చిల్లచెట్లను సొంత నిధులతో తొలగించివేయించారు. ఈ సందర్భంగా జగన్ బాబును పలువురు అభినందించారు.



చిల్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలి

తహసీల్దార్ శైలేంద్రకుమార్

పెద్దారవీడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కౌలు కార్డుల మంజూరీపై రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శైలేంద్రకుమార్ మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డు కోసం భూయజమాని ఆధార్‌కార్డు, పొలం 1బీ, కౌలు రైతు ఆధార్‌కార్డు జిరాక్స్‌లు తీసుకొని గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు. ఈ ఏడాది మండలంలో 1147 కౌలు కార్డులు మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు నిర్దేశించారన్నారు. భూ యజమాని హక్కులకు భంగం కలుగకుండా ప్రభుత్వం కౌలుదారు హక్కు చట్టం 2019 చేసిందన్నారు. కౌలుకు తీసుకున్న రైతు ఆయేడాది సాగు చేసిన పంట మీద మాత్రమే హక్కు కలిగి ఉంటారని తెలిపారు. కౌలుకార్డు తీసుకోవడం వలన కౌలుదారులకు పంట నమోదు చేయించుకునేందుకు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు, పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

కౌలు కార్డులు పొందాలి

రాచర్ల : కౌలు భూములు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కౌలు రైతులకు ఉద్యాన, పట్టు పరిశ్రమ సహాయకులకు కౌలు కార్డులపై అవగాహన కల్పించారు. కౌలు భూములు సాగు చేసి రైతులు కార్డుల కోసం గ్రామ రెవెన్యూ అధికారులను కలవాలన్నారు. మండలానికి 1180కౌలు కార్డులు లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. ఏవో మహబూబ్ బాషా మాట్లాడుతూ కౌలు రైతులు భూయజమాని నుంచి హక్కు పత్రం పొంది రెవెన్యూ అధికారులకు అందజేయాలని తద్వారా వారు కార్డులు జారీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హర్షవర్ధన్, ఏఈఓలు బి శ్రీనివాస్ రెడ్డి, రజిత, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

మంతన్న సేవలు ఆదర్శనీయం

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో విధులు నిర్వహించిన భూమని మంతన్న సేవలు ఆదర్శనీయమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. బొగ్గరపు కల్యాణ మండపంలో మండలంలోని చిలకచెర్ల నందిగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న భూమని మంతన్న ఉద్యోగ విరమణ సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్న దంపతులను శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మంతన్న ఉపాధ్యాయుడిగానే గాక చెంచు గిరిజన సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని, ఈ క్రమంలో పలు సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన నాయకుడన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయన చెంచుల అభివృద్ధికి పాటు పడాలని ఎరిక్షన్‌బాబు కోరారు. కార్యక్రమంలో బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్రబాబు, షేక్ మంజూర్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, కటికల శ్రీనివాస్, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



సన్మానసభలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ప్రకాశ్‌రావును ఆదర్శంగా తీసుకోవాలి

తర్లుపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసిన ప్రకాశ్‌రావును ఆదర్శంగా తీసుకుని సిబ్బంది పనిచేయాలని తహసీల్దార్ కేవీ కిషోర్ అన్నారు. మండలంలోని కేతగుడిపి వీఆర్‌వో ప్రకాశ్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో అతనిని ఘనంగా సన్మానించారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో ప్రకాశ్‌రావు ఎంతో తోడ్పడ్డారని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు దంపతులను తహశీల్దార్, వీఆర్‌వోలు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డి, వీఆర్‌వో సంఘం అధ్యక్షులు కాశీశ్వరరెడ్డి, మండలంలోని వీఆర్‌వోలు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేస్తున్న ప్రకాశ్‌రావును సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

దర్తీ ఆబ అభియాన్‌తో బహుళ ప్రయోజనాలు

మోటా ప్రాజెక్టు అధికారి రిషబా చతుర్వేది

పెద్ద దోర్నాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : దర్తీ ఆబ భగీదరి అభియాన్ అమలుతో కలిగే బహుళ ప్రయోజనాలను వినియోగించుకోవాలని మోటా ప్రాజెక్టు అధికారి రిషబ చతుర్వేది అన్నారు. మండలంలోని చింతల గిరిజన గ్రామంలో దర్తీ ఆబ భగీదరి అభియాన్‌పై చెంచు గిరిజనులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి హాజరయిన ప్రాజెక్టు అధికారి చతుర్వేది గిరిజనులను గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మంజూరయిన 17 మంత్రిత్వ శాఖల నుంచి మౌలిక వసతులు, వ్యక్తి గత అభివృద్ధి పథకాలపై ఆరా తీశారు. పలువురు గిరిజనులు ఆధార్, రేషన్, ఇంటి పట్టా తదితరములు మంజూరు కాలేదని ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన చతుర్వేది పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బలిజేపల్లి గూడెంను సందర్శించారు. అక్కడ మల్టీపర్పస్ కేంద్రాన్ని, గృహ సముదాయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కేవీ శివ ప్రసాద్, ఏపీవో సురేష్ కుమార్, డీటీడబ్ల్యూవో వరలక్ష్మీ,ఎంపీడీవో నాసర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ, ప్రాజెక్టు మేనేజర్ నాయక్, టీఏ షేక్ లాల్ అహ్మద్ కార్యదర్శి అర్జున్‌సింగ్ పాల్గొన్నారు.



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బీసీ హాస్టల్ ఏర్పాటుపై కృతజ్ఞతలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో ఒక ప్రైవేట్ భవనంలో బీసీ హాస్టల్ త్వరలో ఏర్పాటు చేస్తున్నందుకు బీసీ సంఘ నాయకులు పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాశ్వత భవనం కోసం కృషి చేసి నిర్మిస్తే బీసీ బాలికలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రంగస్వామి, రాజ్ కుమార్, చెంచయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

ముండ్లమూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు, పెదరావిపాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకుంటే స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మూర్తి, వీఆర్వో దయానందం, బీఎల్వోలు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

ముండ్లమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం శంకరాపురం గ్రామంలో జరిగిన సీపీఎం శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. మార్కెట్ యార్డుల్లో దళారుల దోపిడీ విపరీతంగా పెరిగిందన్నారు. 2024 - 25 ఖరీఫ్ సీజన్ పంటల బీమా అమలు చేస్తామన్న ప్రభుత్వం ఆఊసే ఎత్తటం లేదన్నారు. గ్రీన్ ఎనర్జీ, బయోగ్యాస్ వంటి పేర్లతో వేలాది ఎకరాల పంటల భూములు అదాని, అంబానీలకు కట్ట బెడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతరావు, పంటా ఏడుకొండలు, గాలి వెంకటేశ్వర్లు, రాజా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

పామూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. సోమవారం పారిశుధ్య కార్మికులు, ఒప్పంద కార్మికులు పంచాయతి కార్యదర్శి జీవీ అరవిందరెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. అలాగే, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్‌కు ముఠా కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో కె.మాల్యాద్రి, వై.వీరనారామణ, శంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

సీఎస్‌పురం(పామూరు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలపరిషత్ సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగిన సమావేశానికి ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, ఒక ఎంపీటీసీ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా వేసినట్టు బ్రహ్మయ్య తెలిపారు.

ప్రతినెలా సమావేశాలు నిర్వహించాలి

పామూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సంఘాల బలోపేతానికి, ఆర్థిక పరిపుష్టికి ప్రతినెలా సమావేశాలు నిర్వహించాలని ఏపీఎం జి.విద్యాసాగర్ సూచించారు. మండల మహిళా సమాఖ్య సమావేశం అధ్యక్షురాలు ఓ.సుబ్బమ్మ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 1369 సంఘాలు ఉండగా, సుమారు మూడు వందల సంఘాలకు సంబంధించిన పూర్తి సమాచారం లేదన్నారు. 46 మంది వీవోఏలకు గాను కేవలం 20 మంది హాజరుకావడంపట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.2 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 30(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.2,22,977 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.85,570, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,750, అన్నదాన పథకానికి రూ.44,061, పంచామృత అభిషేకానికి రూ.33,096, మహాప్రాకార నిర్మాణానికి రూ.22,500 వచ్చినట్లు తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ

తాళ్లూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ముండ్లమూరు తహసీల్దార్ ఎం.లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె.సంజీవరావు 30వ తేదీ పదవీ విరమణ చేశారు. ప్రజలకు రెవెన్యూ పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముండ్లమూరు తహసీల్దార్ ఎం.లక్ష్మీనారాయణను ఇంచార్జి తహసీల్దార్(పూర్తి అదనపు బాధ్యతలతో)గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో లక్ష్మీనారాయణ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

కంటి ఆపరేషన్లకు శంకర వైద్యశాలకు తరలింపు

తాళ్లూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు ప్రత్యేక వాహనంలో సోమవారం తరలించారు. తాళ్లూరు, ముండ్లమూరు పీహెచ్‌సీ పరిధి లోని గ్రామాల్లో శంకరనేత్రాల వైద్యులు ఇటీవల కంటి పరీక్షలు నిర్వహించారు. తాళ్లూరులో 60మంది, ముండ్లమూరులో 103 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు శంకర వైద్యశాలకు చెందిన వాహనంలో తరలించారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం కనిగిరిలోని ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆసుపత్రిలోని వార్డులన్నీ కలియతిరిగారు. కంగారు మదర్ కేంద్రాన్ని పరిశీలించారు. స్కానింగ్ గదులు, ఆపరేషన్ గదులను పరిశీలించారు. మదర్‌కేర్ వార్డులోని బాలింతలను ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై విచారించారు. ఆసుపత్రిలోని సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్య సేవల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా.. ఆసుపత్రిలో వైద్యులు సకాలంలో పరీక్షలు చేస్తున్నారా.. వైద్య సిబ్బంది ఎలా నడుచుకుంటున్నారు? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని బాలింతలు, వారి బంధువులను అడిగారు. ఎలాంటి ఇబ్బందులు లేవని వైద్యసేవలు బాగున్నాయని ఎమ్మెల్యేకు చెప్పారు.

అనంతరం దాదాపు రూ.ఒక కోటితో ఆసుపత్రి పైఅంతస్థులో నిర్మిస్తున్న నూతన డయాలసిస్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీర్‌కు సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మించాలని కోరారు. క్యూరింగ్ కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. మెటీరియల్‌లో నాసిరకం వాడినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎమ్మెల్యే వెంట డయాలసిస్ నూతన భవన నిర్మాణ ఇంజనీర్లు, సిబ్బంది, అధికారులు ఉన్నారు.



ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై వృద్ధురాలిని విచారిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిధిలో నిర్మాణాల్లో ఉన్న గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయాలన్నారు. మండలంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన గ్రామాల్లో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటుకోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. డీజీపేట నుంచి కోనపల్లికు వెళ్లే రహదారి నిర్మాణానికి టెండర్లు పూర్తయినట్లు చెప్పారు. సమావేశంలో డీఎల్‌డీవో శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ అహ్మద్ హుసేన్, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి టీడీపీ నాయకులు బి.వెంగయ్య, బొబ్బూరి రమేష్, మాలకొండయ్య, చెరుకుపల్లి వెంకటరెడ్డి, సర్పంచ్ శీరాం పద్మావతి, లక్ష్మీదేవి, చావా చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంలో భాగస్వాములు కావాలి

కనిగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రక్తదానంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం జనసీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. 90 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, వెంకన్న, రమేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..

కాలంచెల్లిన విద్యుత్ స్తంభాలు

» అతుకులు వేసి కరెంట్ సరఫరా
» వేలాడుతున్న తీగలు
» ఆందోళన చెందుతున్న ప్రజలు

దర్శి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఎంతోకాలంగా తుప్పుపట్టి కాలంచెల్లిన విద్యుత్ స్తంభాలకు అతుకులు వేసి కరెంట్ సరఫరా చేస్తున్నారు. అనేకచోట్ల విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది పొంచి ఉన్న ప్రమాదాలను గుర్తించటం లేదు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో సుమారు 50 సంవత్సరాల క్రితం వేసిన ఇనుప స్తంభాలు తుప్పుపట్టి ఉన్నాయి. అనేక స్తంభాలు విరిగిపోయినప్పటికీ కొత్త స్తంభాలు వేయకుండా అతుకులు వేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటులో ఆ శాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దర్శి పట్టణంలో విరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేయాల్సి ఉన్నప్పటికీ వాటి గురించి పట్టించుకోవటం లేదు. అనుమతి లేని లేఅవుట్లకు యథేచ్ఛగా కొత్త స్తంభాలు వేసి లైన్లు బిగిస్తున్నారు. అడిగిందే తడవుగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి కరెంట్ సరఫరా ఇస్తున్నారు. అక్రమ లేఅవుట్లలో అనేక చోట్ల ఒక్క ఇల్లు కూడా నిర్మించిన దాఖలాలు లేవు. రాత్రిపూట విద్యుత్ వెలుగులు విరాజిల్లుతున్నాయి. విరిగిన స్తంభాల గురించి పట్టించుకోక పోవటం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదేమిటని అడిగితే మెటీరియల్ కొరత ఉందని చెబుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి వేసి వేలాడుతున్న తీగలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ స్తంభానికి సాలెగూడులా అల్లుకున్న తీగలు



విరిగిన విద్యుత్ స్తంభానికి అతుకువేసి కరెంట్ సరఫరా

స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించాలి

» పెదఅలవలపాడులో పర్యటించిన కేంద్ర బృందం

వీసీపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర బృందం సభ్యులు జి.సుధీర్, ఎమ్.ప్రశాంత్‌లు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు మండలంలోని పెదఅలవలపాడు గ్రామంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా 20 గృహాలను పరిశీలించారు. ఆయా గృహాల్లో మరుగుదొడ్లు ఉన్నాయా, లేవా, సొంతంగా ఇంటిని నిర్మించుకున్నారా, ప్రభుత్వ నిధులతో నిర్మించుకున్నారా? అని గృహ యజమానులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం ఎలా ఉందంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలలోని మరుగుదొడ్లను పరిశీలించారు. వాటి వినియోగం, పారిశుధ్య నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛభారత్‌పై అవగాహన, పారిశుధ్య పనుల గురించి సర్వే నిర్వహించిన బృందం వాటి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని బృందం సభ్యులు చెప్పారు.

అనంతరం గ్రామ సచివాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తడిచెత్త, పొడిచెత్తను సేకరించి చెత్తసంపద కేంద్రానికి తరలించి కంపోస్టు ఎరువును తయారు చేయించాలని చెప్పారు. కంపోస్టు ఎరువులు తయారుచేసి విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ ఖాజావలి, జి.సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కనిగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రతతో ఉండాలని కేంద్ర బృందం సభ్యుడు రవికుమార్ అన్నారు. మండలంలోని గుడిపాడు గ్రామంలో సోమవారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిశీలించారు. ఈసందర్భంగా రవికుమార్ గ్రామస్థులతో మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామంలో రోడ్లను పరిశుభ్రం చేయాలన్నారు. ఇంటి పరిసరాల సమీపంలో చిల్ల చెట్లను తొలగించాలని సూచించారు. నీటి నిల్వ తొట్టెలపై మూతలు లేకపోతే ఆయా ఇంటి యజమానులతో వెంటనే మూతలు పెట్టించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇళ్లలో మరుగు దొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో సేకరించిన చెత్తనుంచి వర్మీ కంపోస్టు తయారీ చేస్తున్న షెడ్డును పరిశీలించారు. డ్రేనేజీల్లో దోమల నివారణ ఆయిల్‌ను పిచికారి చేయాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరశర్మ, రామమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞాపురి కాలనీలో 29 బైకులు స్వాధీనం

కురిచేడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులమంద పంచాయతీ ప్రతిజ్ఞాపురి కాలనీలో సోమవారం తెల్లవారు జామున త్రిపురాంతకం సర్కిల్ పోలీసులు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణతో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రకాశం జిల్లా పోలీస్ శాఖ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఎస్పీ దామోదర్ ఆదేశాలతో డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సిఐ అసన్ తన సర్కిల్ ఎస్ఐలతో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాలతో ముఖ్యమైన కూడళ్లలో వెతికారు. తనిఖీలలో సరైన పత్రాలు లేని 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ గ్రామస్థులకు సూచించారు. కార్డన్ సెర్చ్‌లో కురిచేడు, దొనకొండ, త్రిపురాంతకం ఎస్సైలు శివ, త్యాగరాజు, శివ బసవరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

వెలిగండ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కృష్ణపావని పేర్కొన్నారు. సోమవారం వెలిగండ్ల జడ్పీ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థులు స్నేహితులుగా సోదరభావంతో మెలిగి దేశభక్తి కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలతో కలిగేనష్టాలు, సమస్యలు తెలియజేస్తూ వాటిని ప్రోత్సహించిన వారికి కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టంపై వివరించారు.

యువత మానసిక బలహీనత వల్ల మాదక ద్రవ్యాలకు అలవాటు పడతారని, ఆతరువాత ఒక వ్యసనంగా మారుతుందన్నారు. మాదక ద్రవ్యాలు వాడటం వల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని, మైండ్ కంట్రోల్ ఉండదని తెలిపారు. విద్యార్థులు ఇటువంటి చెడు అలవాట్ల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణపావణి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలకు, మేకలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న నట్టల మందును ఉపయోగించుకోవాలని జిల్లా షీప్ సొసైటీ ఛైర్మన్ తోడేటి గోపి అన్నారు. మండలంలోని డీజీపేట పశువైద్యాధికారి డాక్టర్ మునీర్ ఆధ్వర్యంలో సోమవారం బోడావులదిన్నె గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల మందును తాపించారు. ఈసందర్భంగా గోపి మాట్లాడుతూ సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, బొబ్బూరి రమేష్, సొసైటీ సభ్యులు రాగిసాని పుల్లయ్య, పశువైద్య సహాయకులు శివన్నారాయణ, వినీత్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతంచేయాలి

పామూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఏపీవో బి.మాల్యాద్రి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. పని అడిగిన ప్రతి కూలీకి పనులు చూపెట్టాలన్నారు. సమావేశంలో టీఏలు మనోహర్, బాలకృష్ణ, రాజేంద్ర, ఈసీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బసవయ్యకు ఘనసన్మానం



ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎం బసవయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దర్శి ఎన్ఎస్‌పీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన చీదెళ్ల బసవయ్య, ఆదిశేషారత్నం దంపతులను సోమవారం ఘనంగా సన్మానించారు. దర్శి ఎంఈవోలు కె.రఘురామయ్య, రమాదేవి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్ రెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాఠశాలలో వారిని ఘనంగా సన్మానించి వారుచేసిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా బసవయ్య మాట్లాడుతూ 39 సంవత్సరాల పాటు ఎంతో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఘన సన్మానం చేసిన అధికారులు, ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

తాళ్లూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడులో గల శ్రీకోదండరామస్వామి ఆలయానికి దూపదీప నైవేద్యం పథకం కింద నిధులు మంజూరు చేస్తూ దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈపథకం కింద నెలకు ఆలయ పూజారికి రూ.7వేలు, ఇతర సామాగ్రికి రూ.3వేలు వంతున మంజూరయింది. గ్రామస్థుల విన్నపం మేర కు ఆలయ అభివృద్ధికి పాటుపడుతూ దూపదీప నైవేద్యం పథకం కింద నిధుల మంజూరుకు తోడ్పాటు నందించిన రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, తదితరులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పెట్టెకు ఉత్సవం

పామూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకల్లో భాగంగా మూడవ రోజు సోమవారం సాయంత్రం పీర్ల పెట్టెలను దించి చావిడి వరకు ఉత్సవం నిర్వహించారు. పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ వద్ద గల ప్రధాన పీర్ల చావిడికి సంబంధించి స్థానిక అకులవీధిలో ఉన్న శ్రీహజరత్ మహబూబ్‌సుభాని స్వామివారి దర్గా వద్ద పీర్ల పెట్టెకు ముజావర్లు ప్రత్యేక (ఫాతేహాలు) ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో పాత బస్టాండ్ వద్ద ఉన్న పీర్లచావిడికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా మొక్కుబడులు చెల్లించుకున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

కనిగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మూడేళ్ళ నుంచి ఆరేళ్ళ లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూపర్‌వైజర్ పార్వతమ్మ అన్నారు. మండలంలోని గురువాజీపేటలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సెక్టార్ పరిధిలోని ప్రతి గ్రామంలోని మూడేళ్ల నుంచి ఆరేళ్ళ లోపు చిన్నారులను గుర్తించాలన్నారు. గుర్తించిన చిన్నారుల పూర్తి ఆధారాలతో అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూపీస్కూల్ హెచ్‌ఎం సుజాత, అంగన్‌వాడీ వర్కర్లు, చిన్నారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులను నియమించాలి

కనిగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులను నియమించాలని స్కూల్ ఛైర్మన్ పి.మోహన్ సోమవారం ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 300 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, సోషల్ ఉపాధ్యాయులు లేకపోవడంతో తరగతులు సక్రమంగా జరుగటం లేదని ఆర్డీవోకు విన్నవించారు. ఆర్డీవో సానుకూలంగా స్పందించి ఉపాధ్యాయలను నియమించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

కనిగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన సోమవారం మండలంలోని తమటంవారిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పామూరు నుంచి కనిగిరి వైపు కొంతమంది ప్రయాణికులతో వస్తున్న కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారులో ఉన్న ప్రయాణీకులు అప్రమత్తమై కిందకి దిగేశారు. అనంతరం కారు పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. ఈఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కనిగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పామూరు రోడ్డులోని కొత్తూరు సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ ప్రాంతానికి చెందిన జీవారాం (30) కొత్తూరు సమీపంలో గణేష్ విగ్రహాల తయారీ పనికివచ్చాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి రోడ్డుపైకి రావటంతో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి సాయి సప్తాహం

కనిగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జూలై 2 నుంచి అఖండ సాయినామ సప్తాహం ప్రారంభమవుతుందని బాబా దేవాలయం కమిటీ ఛైర్మన్ సత్యాలు, కార్యదర్శి బాలు ఓబులురెడ్డి తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొనాలని సోమవారం రాత్రి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని ఆయన నివాసంలో ఆలయకమిటీ కలిసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.



జీడీసీసీ బ్యాంకు సీఈఓగా అజయ్ కిషోర్



గుంటూరు సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (జీడీసీసీ)సీఈఓ నియామ కంపై ఏర్పడిన ప్రతిష్టం భనకు ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. జీడీసీసీ బ్యాంకు కొత్త సీఈఓగా సీహెచ్ అజయ్‌కిషోర్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరిం చారు. కొత్త సీఈఓకు సహకార శాఖ రాష్ట్ర ఉద్యోగుల సంఘం నేత మొవ్వా వెంకటేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పురుగుల బియ్యం.. ప్రభుత్వం సీరియస్



బియ్యంలో పురుగులు పాకుతున్నా ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం (పాత చిత్రం)

- ఐదుగురు సిబ్బంది సస్పెన్షన్
- గోదాము మేనేజర్‌పైనా చర్యలకు ఆదేశం
- కొనుగోళ్లలో అవకతవకలే కారణమని ప్రాథమిక నిర్ధారణ
- సమగ్ర విచారణకు ప్రత్యేక బృందం

తెనాలి, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే బియ్యంలో పురుగులు ఉండటంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. స్టేట్ వేర్‌హౌసింగ్ గోదాములో పనిచేసే టెక్నికల్ సిబ్బంది, ఇతర అధికారులు కలిపి మొత్తం ఐదుగురిపై సస్పెన్షన్ వేటు వేసింది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. గోదాము మేనేజర్‌పై చర్యలకు ఆదేశించడంతో పాటు, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకానికి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని చిన్నారులకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ బియ్యంలో పురుగులు ఉండటం, అవి తిరుగాడుతుండగానే ప్యాకింగ్ చేసేస్తుండటంపై ఈ నెల 24న ఆంధ్రజ్యోతి దినపత్రికలో సన్నగిల్లుతున్న లక్ష్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. ముక్కు పురుగులు సంచుల నిండా ఉన్నా.. వాటిని అలానే.. పాఠశాలలకు పంపేందుకు ప్యాకింగ్ చేసి, సిద్ధం చేశారు. దీనిపై సమాచారం అందడంతో ఆంధ్రజ్యోతి పరిశీలించింది. పురుగులు ప్రత్యక్షంగా కనిపించడం, నాణ్యమైన బియ్యం స్థానంలో నాసిరకం బియ్యం కొనుగోలు చేయడం.. ఇందులో భారీ మొత్తంలో మామూళ్ల రూపంలో డబ్బు చేతులు మారడం తదితరాలు వెలుగులోకి రావడంతో.. పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులను తక్ష ణ పరిశీలనకు మంత్రి మనోహర్ ఆదేశాలిచ్చారు. ఉన్నతాధికారులు తెనాలి



సన్నగిల్లుతున్న లక్ష్యం శీర్షికన పురుగుల బియ్యంపై ఈ నెల 24న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

గోదాములో బియ్యం నిల్వలను పరిశీలించారు. వారికి కూడా పురుగుల మయమైన బియ్యం కనిపించడంతో.. నాశిరకం బియ్యం కొనుగోళ్ల కారణంగానే ఈ లోపం జరిగినట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. బియ్యం కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఎస్.డబ్ల్యుసి గోదాముల టెక్నికల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణమని తేల్చారు.దీనిపై సమగ్ర విచారణ కోసం విజయవాడ నుంచి ఒక ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు తెలిసింది. వారు దీనిపై విచారణ జరిపి, లోపం ఎక్కడ జరిగింది? అవకతవకలకు పాల్పడిన సిబ్బంది ఎవరనేది తేల్చాల్సి ఉంది. ఇప్పటికే విచారణ కూడా మొదలు పెట్టినట్టు సమాచారం. త్వరలో పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. ఆ తర్వాతే చేతివాటం చూపిన సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.



ఆగంతకులకు రాచమార్గం

- ఈఎఫ్‌టీలోనే అసలు తంటా
- రెల్వే ప్రయాణికుల భద్రత గాలిలో దీపం
- రైళ్లలో దోపిడీలకు టీటీఈలే పరోక్ష కారణం ?

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైళ్లలోని రిజర్వేషన్ బోగీల్లో భద్రత గాలిలో దీపంలా మారింది. వరుస చోరీలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. దీనంతటికీ పరోక్ష కారణం.. టీటీఈల చేతివాటమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే స్లీపర్, ఏసీ త్రీటైర్ బోగీల్లో ఆగంతకులు దర్జాగా ప్రయాణిస్తున్నారు. ఈ విధానానికి అడ్డుకట్ట వేయాల్సిన రైల్వే శాఖ.. అందుకు విరుద్ధంగా ఆదాయమే పరమావధిగా వ్యవహరిస్తోంది. రిజర్వేషన్ లేని వాళ్లకు ఫైన్లు వేసి మీ ఇష్టం వచ్చిన చోట కూర్చోమని ఈఎఫ్‌టీ(ఎక్సెస్ ఫేర్ టిక్కెట్) రాసి టీటీఈ చేతిలో పెడుతున్నారు. దీనిని అవకాశంగా చేసుకొంటున్న దోపిడీ దొంగలు అర్ధరాత్రి ప్రయాణికులందరూ నిద్రలోకి జారుకున్నాక తమ ప్రతాపం (మిగతా 6వ పేజీలో)

సాగు నీరు విడుదల ఎప్పుడో

- ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం



నారుమడి పోసేందుకు సిద్ధంగా ఉన్నపాలం

అమృతలూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమడెల్టా కాల్వలకు సాగు నీటి విడుదల ఎప్పుడని రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది జూలై మొదటి వారంలోపే నీటిని విడుదల చేశారు. కానీ, ఈ ఏడాది నీటి విడుదలపై ప్రభుత్వం ఇంత వరకు ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉన్నా.. విడుదల ఆలస్యంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు వాతావరణం అనుకూలతతో ఎదసాగు చేపట్టారు. కొన్ని రోజులుగా వర్షం పడకపోవడంతో వీరు కూడా నీటి తడి ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. నారుమళ్లు పోసేందుకు సిద్ధమైన రైతులు కూడా.. నీటి విడుదల తేదీ ఖరారు కాకపోవడంతో సందిగ్ధతో ఉన్నారు. నీటి విడుదల ఆలస్యమైతే.. ముదురు నాట్లు, లేత నాట్లు వేసే రైతులు అందరూ ఒకేసారి నాట్లు వేయాల్సి వస్తుందని దీంతో కూలి రేట్లు కూడా విపరీతంగా పెరు గుతాయని వాపోతున్నారు. వెంటనే నీటి విడుదల చేపడితే తమకు మేలు జరుగుతుందని రైతులు కోరుతున్నారు.



- రిజర్వాయర్‌కు ఒక వైపున పూర్తైన ఫస్ట్ లేయర్ ఫౌండేషన్

వరద నీటి నిర్వహణ

పర్యాటక ఆకర్షణ

వేగంగా సెంట్రల్ పార్కు రిజర్వాయర్ పనులు

- పూర్తయిన పూడిక తీత
- తుది దశకు ఫస్ట్ లెవెల్ ఫౌండేషన్
- వర్షాలకు నీరు చేరకుండా జాగ్రత్తలు
- చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన వరద నీటి నిర్వహణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శాఖమూరులో నిర్మిస్తున్న సెంట్రల్ పార్కులోని 50 ఎకరాల కొండవీటి వాగు రిజర్వాయర్ పూర్తికావొస్తోంది. వర్షాలు పడుతున్నప్పటికీ పనులు ఆగకుండా ఎప్పటి కప్పుడు జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. కేవలం రిజర్వాయ ర్‌గానే కాకుండా.. ఒక పర్యాటక ప్రాంతంగా దీనిని తీర్చిదిద్దేందుకు ఇక్కడ అన్ని ఏర్పాట్లను సీఆర్‌డీఏ చేస్తోంది.

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని శాఖమూరు గ్రామంలో నిర్మిస్తున్న 300 ఎకరాల సెంట్రల్ పార్కులో కొండవీటి వాగు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, సీఆర్‌డీఏ నిర్ణయించింది. కొండవీటి వాగు వరద నీటి నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఈ రిజర్వాయర్‌ను సెంట్రల్ పార్కులో ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటక ఆకర్షణగా ఉంటుందని భావించిన ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. కొండవీటి వాగుకు వరద నీరు వచ్చినప్పుడు ఈ రిజర్వాయర్‌ను నింపు తారు. అది కూడా నిండిపోయాక అదనపు ప్రవాహాన్ని నీరుకొండ రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడ కూడా నిండి పోయాక కృష్ణాయపాలెం- కురగల్లు మధ్య నిర్మించే మరో రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. అవి కూడా నిండి పోయాక అదనపు నీటిని కృష్ణా నది వైపు నకు వదిలేస్తారు. కృష్ణా నదిలో కూడా వరద ప్రభావం ఎక్కువగా ఉంటే ప్రకాశం బ్యారేజీ వద్ద నిర్మించిన ఎత్తిపోతల యంత్రాల ద్వారా కృష్ణా నదిలోకి తోడి పోస్తారు. ఇలా రాజధాని వరద నీటి (మిగతా 6వ పేజీలో)



రిజర్వాయర్‌లో జరుగుతున్న తొలి దశ ఫౌండేషన్ పనులు

జేజేఎం..వేమూరుకు రూ.9.72 కోట్లు

వేమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 18 గ్రామాలకు అత్యవసర మంచినీటి సమస్య పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.9,72,37,000 నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు తెలిపారు. వేమూరు మండలం చావలిలో అదనపు ట్యాంకు నిర్మాణానికి రూ.53.58లక్షలు, పెరవలిపాలెంలో ట్యాంక్ దెబ్బతినడంతో కొత్త ట్యాంకు నిర్మాణానికి రూ.99 లక్షలు, పెనుమర్రులో ఉప్పు నీటి సమస్య పరిష్కారం కోసం.. కొల్లూరు మండలం చినపులివర్రు గ్రామం నుంచి 4 కిలోమీటర్ల దూరం పైపులైన్ నిర్మాణానికి రూ.46.20 లక్షలు, కోడిపర్రు గ్రామానికి చావలి రోడ్డు మార్గంలో బోరు ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు రూ.18 లక్షలు మంజూరు చేశారు. కొల్లూరు మండలం కిష్కింద పాలెంలో పైపులైను విస్తరణకు రూ.9.95 లక్షలు, పోతార్లంకలో పైపులైను విస్తరణకు రూ.5.94 లక్షలు మంజూరయ్యాయి. అమృతలూరు గ్రామంలో కొత్త ట్యాంకు నిర్మాణానికి రూ.51 లక్షలు, యలవర్రులో అదనపు బోరు ఏర్పాటుతో పాటు పైపులైను విస్తరణకు రూ.10 లక్షలు, గోపాయపాలెంలో పైపులైను ఏర్పాటుకు రూ.50 లక్షలు, ప్యాపర్రులో మైక్రోఫిల్టర్ ఏర్పాటుతో పాటు పైపులైను ఏర్పాటుకు రూ.58.3 లక్షలు, గోవాడలో ట్యాంకు నిర్మాణంతో పాటు పైపులైను ఏర్పాటుకు రూ.కోటి, ఇంటూరులో 120 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మాణం.. పైపులైను టాప్స్ ఏర్పాటుకు రూ. 1.77 కోట్లు మంజూరు చేశారు. భట్టిప్రోలు మండల కేంద్రంలో అదనపు పైపులైను టాప్స్ ఏర్పాటుకు రూ.70 లక్షలు, అద్దేపల్లిలో ట్యాంకు నిర్మాణానికి రూ.22.30 లక్షలు, కోనేటిపురంలో అదనపు ట్యాంకు నిర్మాణానికి రూ.39.70 లక్షలు మంజూరయ్యాయి. చుండూరు మండలం ఆలపాడులో పైపులైను టాప్స్ ఏర్పాటుకు రూ.47.50 లక్షలు, మండూరులో ట్యాంకు నిర్మాణానికి రూ.76.30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో అమృతలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో ట్యాంకు నిర్మాణం పనులు ప్రారంభించి నట్లు ఏఈలు వెల్లడించారు. మిగతా 17 గ్రామాల్లో పనులను త్వరితంగా ప్రారంభిస్తామన్నారు.

నల్లబర్లీ కొనుగోలు

చారిత్రాత్మకం



పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి వేదికపై మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి

- మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి
- పంగులూరు, ఇంకొల్లులో పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పంగులూరు, ఇంకొల్లు జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని, రైతులను ఆదుకునే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మానవత్వం చాటారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండల కేంద్రమైన పంగులూరు మార్కెట్ యార్డ్ నందు మార్క్‌ఫెడ్ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడుతూ నల్ల బర్లీ సాగును ప్రోత్సహించిన కంపెనీలు పంట కొనుగోలు సమయంలో ముఖం చాటేస్తే రాష్ట్ర ప్రభుత్వం వారి కష్టాలను గుర్తించి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న మామిడి, కోకో, పొగాకు పండించిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవడమే ఇందుకు నిదర్శనమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రూ.1637 కోట్లను రైతులకు బకాయి పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించి నిబద్ధత చాటుకొందన్నారు.



పొగాకు తేమ శాతాన్ని మంత్రులకు వివరిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్

కొరిశపాడు, మార్టూరులో కొనుగోలు కేంద్రాలు

కొనుగోలు కేంద్రాలను మరిన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. కొరిశపాడు, మార్టూరులలో పొగాకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ చరిత్రలో నిలుస్తుందన్నారు.

కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రోజుకు 30 టన్నుల పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు పెంచనున్నట్లు తెలిపారు. అనంతరం యార్డ్ ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యార్డ్ చైర్మన్ పద్మావతి, మార్క్‌ఫెడ్ ప్రత్యేకాధికారి కె.కిషోర్, డీఎం కరుణశ్రీ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, యార్డ్ కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆర్‌డీవో. చంద్రశేఖర నాయుడు, జిల్లా సహకార అధికారి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇంకొల్లులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్రవిద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేస్తోందన్నారు. సుమారు రూ.270 కోట్లు దీని కోసం కేటాయించారన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి డైనమిక్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు.



ఇంకొల్లులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి



గ్రావెల్ తవ్వకాలుతో కొండ దిగువ భాగం

కొండ చెరువుగా మారుతోంది!

ధర్మవరం కొండ చుట్టూ భారీ మట్టి తవ్వకాలు

అద్దంకి,జూన్30(ఆంధ్రజ్యోతి): గ్రావెల్ అడ్డగోలు తవ్వకాలతో ధర్మవరం సమీపంలోని కొండ దిగువభాగం చెరువులను తలపించేలా మారింది. విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం అద్దంకి ప్రాంతంలోని ధర్మవరం చెరువుతో పాటు పలు కొండల నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు. ధర్మవరం చెరువులో మట్టి తవ్వకంతో నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుందని గ్రామస్థులను ఒప్పించి గ్రావెల్ తవ్వారు. అయితే ప్రస్తుతం ధర్మవరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సమీపంలో అద్దంకి, పంగులూరు, మార్టూరు మండలాల సరిహద్దులో ఉన్న కొండపై వీరి కన్ను పడింది. గతంలో నీరు-చెట్టు పథకం ద్వారా కొండ చుట్టూ కందకాలు తవ్వగా, ప్రస్తుతం ఆ కందకాల స్థానంలో సుమారు 30 అడుగుల లోతుతో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. దీంతో గ్రావెల్ తవ్వకాలు చేసిన ప్రాంతంలో నీటి ఊట కూడా వస్తోంది. గ్రావెల్ తరలింపునకు అనుమతులు తీసుకున్నా కొండ అడుగు భాగంలో లోతుగా చెరువులను తలపించేలా గోతులు తవ్వకూడదనే నిబంధన ఉందని రెవెన్యూ అధికారులు సైతం చెబుతున్నారు. నిత్యం వందల టిప్పర్ల మట్టి తరలిస్తుండటంతో కొండ ఆనవాళ్లు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. కొండ పైన పూర్తిగా శిథిలమైన అతిపురాతన నీలకంఠేశ్వరస్వామి ఆలయం ఉంది. ఎంతో చరిత్ర ఉన్న కొండను గ్రావెల్ తవ్వకాలకు వినియోగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ మరమ్మతులు చేపట్టేందుకు టెండర్లు పూర్తైన నేపథ్యంలో సమీపంలో 30 అడుగుల లోతులో గోతులు తవ్వితే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు ఇంకిపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండ వద్ద గ్రావెల్‌ను నేలమట్టం లో మాత్రమే తవ్వకాలు చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వరద నీటి నిర్వహణ..

పర్యాటక ఆకర్షణ

(5వ పేజీ తరువాయి)

నిర్వహణలో ఈ రిజర్వాయర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. కాగా శాఖమూరు రిజర్వాయర్‌ను కేవలం రిజర్వాయర్‌గానే కాకుండా పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు సీఆర్డీఏ ప్రయత్నిస్తోంది. ఫ్లవర్ గార్డెన్, క్రాఫ్ట్ బజార్, అమ్యూజ్‌మెంట్ పార్కు, మ్యూజికల్ ఫౌంటేన్, లేజర్ షో ఏర్పాటు చేయడంతోపాటు, రిజర్వాయర్లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దాంతోపాటు వాకింగ్ ట్రాక్, యోగా, మెడిటేషన్ హాళ్లను కూడా ఏర్పాటు చేయాలని సీఆర్డీఏ నిర్ణయించింది.

పూర్తయిన పూడికతీత

50 ఎకరాల్లో నిర్మిస్తున్న శాఖమూరు రిజర్వాయర్ పూడిక తీత పనులు నూరుశాతం పూర్తయ్యాయి. వరద నీరు రిజర్వాయర్‌లోకి రాకుండా మట్టితో ఆనకట్టలు కట్టి అడ్డుకుంటున్నారు. కాగా.. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో స్వల్పంగా నీరు చేరింది. ఆ నీటిని మోటార్లతో తోడుతూ పనులు కొనసాగిస్తున్నారు. రిజర్వాయర్‌కు ఫస్ట్ లెవెల్ కాంక్రీట్ ఫౌండేషన్ పనులు దాదాపు తుది దశకు చేరాయి. తొలి దశ ఫౌండేషన్ పనుల్లో భాగంగా వాటర్ ప్రూఫ్ షీటు అమర్చి, దాని మీద గ్యాబిన్ మెస్ ఏర్పాటు చేసి దాంట్లో రాళ్లు నింపి ఫౌండేషన్ లేయర్‌ను రూపొందించారు. ఈ పనులు తుది దశలో ఉన్నాయి. ఈ వారంలో అది కూడా పూర్తవుతుందని నిర్మాణ సంస్థ చెబుతోంది. కాగా పార్కు చుట్టూతా ఫెన్సింగ్ ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి.

వెల్డింగ్ దుకాణంలో ఇనుప వస్తువులు చోరీ

నాగులుప్పలపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇనుప సామాన్లు చోరీకి పాల్పడిన మహిళా దొంగలను అడ్డుకొన్న వ్యక్తిపై దాడికి తెగబడ్డారు. తీవ్రంగా గాయపరిచారు. సమాచారం అందుకొన్న పోలీసులు మహిళా దొంగలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు..ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వేటపాలెంకు చెందిన తల్లి,కుమార్తెలైన దేవర కోటమ్మ, పెదాల లక్ష్మి సోమవారం తెల్లవారు జామున ఉప్పుగుండూరు గ్రామంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద నున్న ఓ వెల్డింగ్ దుకాణంలో ట్రాక్టర్ సామాన్లు చోరీ చేసి తరలిస్తున్న క్రమంలో అడ్డుకొన్న గ్రామానికి చెందిన గోగినేని కృష్ణపై దాడికి పాల్పడ్డారు. దాంతో కృష్ణ కాలికి సైతం గాయమయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకొని మహిళా దొంగల వద్ద నున్న పెద్దసైజు గోతాలను తనిఖీ చేయగా ట్రాక్టర్ ట్రక్‌కు తగిలించే ఇచ్చితో పాటుగా మరికొన్ని ఇనుప వస్తువులు లభించాయి. దీంతో వారిని స్థానిక పోలీ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

మహిళా దొంగల్లో ఒకరైన లక్ష్మీ భర్త గోపి కూడా చోరుడిగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన ఇద్దరు మహి ళా దొంగలు గ్రామాలలో చోరీ చేసిన సామాన్లను ఒక చోట ఉంచి ఊరిబయట ఆటోలో వేచిఉన్న గోపీకి ఫోన్‌లో సమాచారం అందించి ఆఆటోలోనే వేసుకొని ఉడాయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని డీఆర్వో చాంబర్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకమిషన్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాలు చేర్పులు, మార్పులు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోనే విధంగా పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఓటుకు ఆధార్‌అనుసంధానం కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీ ప్రసన్న, కేశవర్ధనరెడ్డి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు ఎస్, జాన్సన్, కుమార్, వరకుమార్, ఎంవీ సత్యనారాయణ, కే రవీంద్రారెడ్డి, ఎన్నికల సెల్‌సూపరిటెండెంట్ రాజ్యలక్ష్మి, ఒంగోలు తహసీల్దార్ మధుసూదన్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు ఎస్‌కే రసూల్, రమేష్, డీఎస్ క్రాంతికుమార్, తదితరులు ఉన్నారు.

వైభవంగా ప్రేమవాహిని రథోత్సవం



చినగంజాంలో రథోత్సవానికి స్వాగతం పలుకుతున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

చినగంజాం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శతజయంతి దినోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహిస్తున్న సత్య సాయి ప్రేమప్రవాహిని రథోత్సవ కార్యక్రమం చినగంజాం మండలంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. సోపిరాల రైల్వేగేటు వద్ద రథోత్సవానికి మండల సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు, మహిళా సేవాదళ్ సభ్యులు పూర్ణకుంభం, వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్య సాయిబాబా సేవాసమితి మండల కన్వీనర్ మాజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్య సాయిబాబా శతజయంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా రథోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 23న సత్య సాయిబాబా జయంతి వేడుకలు అధికారంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. గ్రామంలోని పలువీధుల్లో సంకీర్తనలు అలపిస్తూ, మహిళల కోలాటంతో రథోత్సవాన్ని నిర్వహించారు. రథానికి భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో మండల సేవాదళ్ సమన్వయకర్త ఎం.రఘురామ్, మహిళా కోర్డినేటర్ లలితమ్మ, యూత్‌లీడర్ ఈశ్వర్‌రెడ్డి, సేవాసమితి సభ్యులు బొమ్మిశెట్టి బాలకోటేశ్వరగుప్త, ముసలయ్య, శ్రీరామ చంద్రమూర్తి, మహిళాసేవాదళ్ సభ్యులు మాజేటి లక్ష్మీప్రసన్న, భక్తులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న 'సత్యసాయి ప్రేమ ప్రవాహిని' రథయాత్ర సోమవారం ఇంకొల్లు చేరుకుంది. ఇంకొల్లు సత్యసా యి భజన మండలి ఆధ్వర్యంలో మహిళలు రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. పుట్టపర్తి నుండి ప్రారంభించిన రథయాత్ర బాపట్ల జిల్లాలో మూడు రోజులుగా సాగు తోంది. సోమవారం ఇంకొల్లు చేరు కుంది. పర్చూరు రోడ్డులోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి సాయిబాబా గుడి వరకు భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. సత్యసాయి భజన మండలి బృందం గోరంట్ల పద్మజ, కరి చిరంజీవి, కరి లక్ష్మణ బాబు, రాధామాధవి, భవాని, విశ్వహిందూ ధర్మపరిషత్ కార్యకర్త లు నార్నె సోమేశ్వర రావు, హనుమంతరావు, మహిళలు పాల్గొన్నారు.



ఇంకొల్లులో రథయాత్ర

అద్దంకి : సత్యసాయి ప్రేమప్రవాహిని రథ యాత్ర సోమవారం రాత్రి అద్దంకి పట్టణం నుంచి సాగింది. సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా సత్యసాయి సేవా సమితీ ఆధ్వర్యంలో చేపట్టిన రథ యాత్ర సోమవారం సాయంత్రానికి అద్దంకి చేరు కొంది. గరటయ్యకాలనీ వద్ద ప్రారంభమైన రదయాత్ర భవానిసెంటర్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీబొమ్మ కూడలి, పోస్టాఫీస్ మీదుగా బాబామందిరం వరకు సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో రథయాత్రను తిలకించారు. సత్యసాయిబాబా సేవాసమితి అద్దంకి శాఖ కన్వీనర్ చిన్ని శ్రీహరిరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిన్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

● ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

చీమకుర్తి,జూన్30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే విధంగా మార్పులు చేపట్టడం సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు.చీమకుర్తి పట్టణంలో 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, గాంధీనగర్, క్రిస్టియన్ పాలెంలో 100 కేవీ ఇంప్రూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం సాయంత్రం బీఎన్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణలు చేపట్టి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయటం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఈ మాకినేని హరిబాబు,ఏడీఈ మోహనరావు, ఏఈలు చంద్రశేఖర్, శ్రీనివాసరావులు టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్,ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు, గొల్లపూడి కోటేశ్వరరావు, కందిమళ్ల గంగాధరరావు, తాతినేని రాము,నర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఆర్‌పీలకు ట్యాబులు పంపిణీ

చీమకుర్తి మున్సిపాల్టి పరిధిలో మెప్మా ఆర్‌పీలకు ట్యాబుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదమహిళలు ఆర్థికంగా ఎదిగేవిధంగా ఆర్‌పీలు సహకారం అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆగంతకులకు రాచమార్గం

(5వ పేజీ తరువాయి)

ప్రదర్శిస్తున్నారు. తాజాగా ఆదివారం వేకువజామునకు ముందు పిడుగురాళ్ల, తుమ్మలచెరువు మధ్యన విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి జరిగిన ప్రయత్నంలో పోలీసులు జరిపిన కాల్పుల ఉదంతం.. రైల్వేలో భద్రతపై మళ్లీ అనుమానాలను రేకెత్తిస్తోంది.

ఈఎఫ్‌టీలో నిబంధనకు నీళ్లు..

బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి యువకులు పనుల కోసం ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. వీళ్లంతా ఎక్కువగా విశాఖ, ఫలక్‌నూమా, అమరావతి, ప్రశాంతి, సిల్చార్, ఎల్‌టీటీ, భావనగర్, నాగర్‌సోల్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణిస్తుంటారు. రిజర్వేషన్ చేసుకొంటే వాళ్ల వివరాలన్ని రైల్వే డేటాలో రికార్డు అవుతాయి. దాంతో ఎలాంటి రిజర్వేషన్ లేకుండానే జనరల్ టిక్కెట్ తీసుకొని స్లీపర్, ఏసీ త్రీటైర్‌లో ఎక్కేస్తుంటారు. భోగీల్లో ఖాళీలు లేకపోతే టీటీఈలు వీళ్లని తదుపరి రైల్వేస్టేషన్‌లో దింపేయాలి. ఒకవేళ ఖాళీలు ఉంటే ఈఎఫ్‌టీ రాసి అందులో ప్రయాణికుల పేర్లు, మొబైల్ నంబర్లు నమోదు చేయాలి. దాని వల్ల ఐడెంటిటీ అనేది పక్కాగా అందుబాటులో ఉంటుంది. అయితే టీటీఈలు ఈ పని చేయడం లేదు. బెర్తులు ఖాళీలు లేకపోయినా ఈఎఫ్‌టీ రాస్తున్నారు. అందులోనూ వివరాలు సరిగా నమోదు చేయడం లేదు. దీని వల్ల రైళ్లలో ఏదైనా నేరం జరిగినా నేరస్తులను గుర్తించడం కష్టతరమవుతోంది.

ఆగంతకులకు ఆహ్వానం..

ఆదాయ లక్ష్యాలను అధిగమించేందుకు టిక్కెట్ కలెక్టర్లు కొన్ని ప్రధానమైన స్టేషన్లలో రైళ్ల బోగీల వద్ద బయట ఉండి ఈఎఫ్‌టీలు రాసి లోపలికి అనుమతిస్తున్నారు. పైన పేర్కొన్న ఏ రైలు గుంటూరు వచ్చినా స్లీపర్ క్లాస్‌లో కాలు పెట్టడానికి కూడా ఖాళీ ఉండదు. చాలా మంది జనరల్ టిక్కెట్లతో.. ఫుట్ బోర్డు, టాయ్‌లెట్స్ వద్ద కూడా కూర్చుని ఉంటారు. గతంలో ఏసీ త్రీటైర్‌లో కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులనే అనుమతించే వారు. ఇప్పుడు వాటిల్లోనూ ఈ ఆగంతకులను అనుమతిస్తుండటంతో భద్రత ప్రశ్నార్థకమైంది. సికింద్రాబాద్ వెళ్లే రైళ్లన్ని అర్ధరాత్రి వేళ సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లకు చేరుకొంటుంటాయి. ఆ సమయంలోనే ప్రయాణికులు కాస్తంత కునుకు తీస్తుంటారు. అప్పుడు దోపిడీ దొంగలు నిర్మానుష్య ప్రదేశంలో చైన్ లాగి.. రైలుని ఆపి దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సకాలంలో ఆర్‌పీఎఫ్ గార్డులు స్పందిస్తే సరి.. లేకుంటే ప్రయాణికుల సొత్తుని భారీగా దోచుకొంటున్నారు. ఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు వీటిపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోతే ప్రయాణికుల ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది.

రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్ ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ శరత్ చౌదరీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీచ్ క్లీనింగ్, మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌లు పంపిణీ, అలాగే కెరీర్ గైడెన్స్ చార్ట్, క్యాన్సర్ రోగులకు మనో ధైర్యం కల్పించే అవగాహన కార్యక్రమాలు, ఆడపిల్లలకు విద్య ప్రాధాన్యతపై సెమినార్‌లు, ఎంపవర్డ్ ఉమెన్, అలాగే దివ్యాంగులకు వీల్ చైర్స్ బహూకరణతోపాటు, వివిధ సేవా కార్యక్రమాలలో రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్ చురుగ్గా పాల్గొనడంపై అవార్డులు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలు ఈ అవార్డులకు పోటీ పడగా, రోటరీ క్లబ్ ఒంగోలు సెంట్రల్‌కు లభించింది. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు బండారు లక్ష్మీ నారాయణ, సురేంద్ర బాబు, కోగంటి గోపాల కృష్ణ, రావిపాటి శ్రీనివాసరావు, గుమ్మడి శ్రీధర్‌లకు అవార్డును అందజేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'అల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

అవీ..ఇవీ..

శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే ముఖ్యం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వేటపాలెం(చీరాల), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి బిడ్డ ఆరోగ్యంలో తల్లిపాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని వేటపాలెం ఎంఈవో జేవీ సుబ్బయ్య అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి పోటీలు నిర్వహించారు. శిశువల సంరక్షణలో తల్లిపాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ , పెయింటింగ్ పోటీల్లో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఉమ్మిశెట్టి వేణుగోపాలరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ, పోతురాజు, పద్మజ, బ్రహ్మానందరెడ్డి, నాగ సునీత, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, జూన్30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తవిద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వేమవరం, మల్లాయపాలెంలలో మంగళవార ఉదయం 8-30 గంటల నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని మార్టూరు డీఈఈ సురేంద్రబాబు తెలిపారు. ఆయా పరిధిలోని పరిశ్రమల నిర్వహకులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళా సర్పంచులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకి, జూన్30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి నిర్ణయాలు తీసుకోవడంలో మహిళా సర్పంచులు కీలకంగా వ్యవహరించాలని, అద్దంకి ఎంపీడీవో శింగయ్య అన్నారు. అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ, పంగులూరు, కొరిశపాడు, మార్టూరు మండలాలలోని మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో శింగయ్య మాట్లాడుతూ మహిళా సర్పంచులు గ్రామాల అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. రిసోర్సుపర్సన్లు మహిళా సర్పంచులు విధులు గురించి వివరించారు.

విశ్వబ్రాహ్మణ సంక్షేమానికి కృషిచేయాలి



పంగులూరులో విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కరకరత్నాచారి

పంగులూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం సంఘ ప్రతినిధులు కృషి చేయాలని అన్నదానసత్ర అధ్యక్షులు కరకరత్నాచారి అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో సంఘ నూతన కార్యలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మచ్చ శేషాచారి, చందు, కన్వీనర్ రాజశేఖర్, సాంబశివరావు, సురేష్, రవిచంద్ర, మల్లికార్జునరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం రామారావు

చినగంజాం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కడవకుదురు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు కుర్రా రామారావు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ సచివాలయంలో, కడవకుదురు పీఎస్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంపై సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలను బడిలో చేర్పించడానికి గ్రామ స్థాయిలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల విద్యాశాఖ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని రామారావు అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు తదితర పథకాలపై గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో డ్రాపౌట్లు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ఎన్.సునీల్, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు కేశన అంజిబాబు, కిశోర్‌బాబు, మోటుపల్లి, కడవకుదురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీబైపాస్ పొడిగింపుపై కసరత్తు

- అవసరమైన సర్వే చేయాలని అధికారులకు మంత్రి రవికుమార్ ఆదేశం
- గుండ్లకమ్మ ముంపు గ్రామాల సమస్యలపై కూడా చర్చ



మంత్రి రవికుమార్‌కు మినీబైపాస్ సమస్యను వివరిస్తున్న మణికేశ్వరం గ్రామస్థులు

అద్దంకి, జూన్30 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని నామ్‌రోడ్డులో ట్రాఫిక్‌ను కొంత మేర తగ్గించేందుకు ప్రతిపాదించిన మినీ బైపాస్ రోడ్డు పొడిగింపునకు అవసరమైన భూసేకరణపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని మంత్రి రవికుమార్ ఆదేశించారు. సోమవారం అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కేఎస్‌బీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన మంత్రి రవికుమార్ స్థానికులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రలతో మినీ బైపాస్ రోడ్డు పూర్తిస్థాయిలో నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సర్వే చేయాలన్నారు. మొదట విడతలో కాకాని పాలెం నుంచి నామ్ రోడ్డు వరకు కాలువ కట్ట అభివృద్ధిపై చర్చించారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు రవీంద్ర వివరించారు. రెండవ విడతలో కాకానిపాలెం నుండి టిడ్కో ఇళ్ల మీదగా, శింగరకొండ సమీపంలో నామ్ రోడ్డు వరకు పొడిగింపు విషయమై చర్చించారు. అద్దంకి మేజర్ కాలువ కట్టలను రెండు వైపులా రోడ్డుగా మార్చడంతో పాటు టిడ్కో ఇళ్లకు కాలువకట్టకు మధ్యలో కొంత మేర రైతుల నుంచి భూమిని సేకరించాల్సి ఉండడంతో సర్వే చేసి నివేదిక అంద జేయాలని తహసీల్దార్ శ్రీచరణ్‌ను ఆదేశించారు.

ముంపు గ్రామాలపై దృష్టి సారించాలి

గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురవుతున్న మణికేశ్వరంలో ఎస్సీకాలనీ వాసులకు ఇంకా ఇళ్లస్థలాలు ఇవ్వకపోవడాన్ని సోమవారం చిలకలూరిపేటలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి రవికుమార్‌ను అద్దంకి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు కరిముల్లా గ్రామస్థులతో కలిసి వివరించారు. వెంటనే రవికుమార్ ప్రాజెక్ట్ ఎస్‌డీసీతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే భూసేకరణ పూర్తి చేసి ఇళ్లస్థలాల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు.

నల్లబర్లీ పూర్తిగా కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు





మాట్లాడుతున్న ఏలూరి సాంబశివరావు, హాజరైన రైతులు

ఇంకొల్లు, జూన్ 30, (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పండించిన ఏ ఒక్క పొగాకు రైతు ఆందోళన చెందనవసరం లేదని చివరి ఆకు వరకు పూర్తిస్థాయిలో పొగాకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఇంకొల్లులో మార్కెట్‌యార్డులో సోమవారం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. దేశచరిత్రలో రైతుల వద్ద నుండి ప్రభుత్వం వాణిజ్య పంటలను కొనుగోలు చేయడం ఇదే ప్రథమమన్నారు. కొనుగోలుకు పేర్లు నమోదు చేసుకొని అధికారులు కేటాయించిన ప్రకారం పొగాకు బేళ్లను యార్డుకు తెచ్చుకోవాలని సూచించారు. 20 శాతంలోపు తేమశాతం ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దద్దుకూరు, భీమవరం ప్రాంత రైతులు తమ పొగాకును ఇంకొల్లు కొనుగోలు కేంద్రపరిధిలో నమోదు చేసుకొని తెచ్చుకోవాలన్నారు. గత ఏడాది పొగాకు మంచి ధర ఉండడంతో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారన్నారు. ధర పడిపోవడంతో వ్యాపారులు కొనే పరిస్థితి లేదన్నారు. దీంతో సీఎం చంద్రబాబు రైతాంగాన్ని ఆదుకోవాలని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. పొగాకు రైతు అధైర్యపడవద్దన్నారు. కలెక్టరు వెంకటమురళీ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 18 పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ఇంకొల్లు కొనుగోలు కేంద్రంలో 8 మంది రైతుల వద్ద నుండి సుమారు 150 బేళ్లను కొనుగోలు చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు, చినగంజాం మండల టీడీపీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, పొద వీరయ్య, పొగాకు రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులు ఖాతాల్లో డబ్బులు జయచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విదేశీ మారకద్రవ్యం అత్యధికంగా ఆర్జించే బ్లాక్ బర్లీ పొగాకు ఇప్పుడు సంక్షోభంలో ఉందన్నారు. రైతులను కష్టాల నుండి బయటకు తీసుకు వచ్చేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకుందన్నారు. పారదర్శకంగా ప్రభుత్వం పొగాకును కొనుగోలు చేయిస్తోందన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని వారు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి, మార్క్‌ఫెడ్ డిఎం. కరుణ శ్రీ, ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, ఆర్డీవో గ్లోరియా, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సమష్టిగా ఆలయ పునర్నిర్మాణం

- ముక్తేశ్వరంలో సీతారాముల దేవాలయ నిర్మాణం పూర్తి
- రూ.కోటి వ్యయంతో పూర్తి చేసిన గ్రామస్థులు



ముక్తేశ్వరంలో నిర్మాణంలో ఉన్న సీతారాముల దేవాలయం



దేవాలయంపై దేవతా మూర్తుల బొమ్మలను చెక్కుతున్న కూలీలు

బల్లికురవ. జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామప్రజలు సమష్టి కృషితో దాతల సహకారంతో జీర్ణావస్థలో ఉన్న సీతారాముల దేవాలయాన్ని పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఎన్నో దశాబ్దాల క్రితం పూర్వీకులు నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులు అందరు నూతన దేవాలయం నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చారు. సుమారు. రూ. 1 కోటి రుపాయల విరాళాలతో దేవాలయం రాతి కట్టుబడి దాదాపు పూర్తి చేయించారు. గత ఏడాది నుండి గ్రామంలో దేవాలయ పనులు జరుగుతున్నాయి. గ్రామ ప్రజలు తమకు తోచిన విధంగా విరాళాలు అందజేయగా దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ పరిసర గ్రామాల నుండి కొంత మేర విరాళాలు సేకరించి దేవాలయ పనులు చేయిస్తున్నారు. సీతారాముల దేవాలయం పనులు 80 శాతం మేర పూర్తి కాగా సేకరించిన విరాళాలు ఖర్చు కావడంతో పనులలో కొంత జాప్యం జరుగుతోంది. అని గ్రామస్థులు తెలిపారు. దేవాలయం ముందు భాగంలో దేవతా మూర్తుల ప్రతిమలను నిర్మించే కొనసాగుతున్నాయి. దేవాలయానికి రంగులు, ధ్వజస్తంభం సమకూరితే ప్రతిష్ఠ మహోత్సవం తేదీని నిర్ణయిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మారుమూల గ్రామంలో కోటి రుపాయలు వెచ్చించి దేవాలయం నిర్మాణం చేపట్టడంపై పలు గ్రామాల నుండి భక్తులు విరాళాలు అందజేస్తున్నారన్నారు.

రోగులు ఫుల్.. వసతులు నిల్

- పర్చూరు పీహెచ్‌సీలో సౌకర్యాలు కరువు
- పనిచేయని బయో ఎనలైజర్ రక్త నమూనా మిషన్





అలంకారప్రాయంగా ఉన్న బయో ఎనలైజర్ రక్త నమూనా మిషన్, తాళం వేసిన ఎక్స్‌రే గది



వైద్యసేవల కోసం ఎదురు చూస్తున్న రోగులు

పర్చూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వసతులు మెరుగు పడడం లేదు. కనీస వసతుల కూడా ఇక్కడ కరువవుతున్నాయి. పర్చూరు 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో (బయో ఎనలైజర్) రక్తనమూనా పూర్తి విశ్లేషణ పరికరం అందుబాటులో ఉన్నా అందులో మోటారు పనిచేయక పోవడంతో అలంకారప్రాయంగా ఉంది. దీని వల్ల అసుపత్రిలో రోగుల రక్తనమూనా పరీక్షలు అవసరమైన మేరకు చేయలేని పరిస్థితి నెలకొంది. అదే విధంగా ఎక్స్‌రే సమకూర్చినా బిగించ పోవడంతో వినియోగంలో లేని పరిస్థితి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగి గాయాలు అయిన వారికి ఎక్స్‌రే పరికరం అందుబాటులో లేకపోవడంతో ఇతర అసుపత్రులకు రిఫర్ చేయవలసిన పరిస్థితి ఉంది. దీంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. చిన్న పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతుండడంతో వారిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వచ్చినా చిన్నపిల్లల వైద్యుడు ఇక్కడ లేడు. దీంతో చికిత్స అందించలేని దుస్థితి. ఇక్కడ పనిచేసిన చిన్న పిల్లల వైద్యులు మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు బదిలీ కావడంతో ప్రస్తుతం ఆపోస్టు ఖాళీగా ఉంది. పర్చూరులో వసతులతో కూడిన ఒక్క ప్రైవేటు వైద్యశాల కూడా అందుబాటులో లేదు. చిన్నపిల్లలకు ఏదైన ఆరోగ్య సమస్య తలెత్తితే పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పేదలు ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉన్నత వైద్యశాఖ అధికారులు తక్షణం స్పందించి ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైనా వైద్య సౌకర్యాలు కల్పించడంతోపాటు, పిల్లల వైద్యుడిని కూడా నియ మించాలని ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా అధికా రులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం

మార్టూరు,జూన్30(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో ద్రోణాదుల నుంచి దగ్గుబాడు మేజరులో జంగిల్ క్లియరెన్స్ పనులను సోమవారం టీడీపీ గ్రామ నాయకులు ప్రారంభించారు. ఈ మేజరులో ఇడుపులపాడు రెగ్యులేటర్ నుంచి చిమ్మిరిబండ రెగ్యులేటర్ వరకు 6.6 కిమీ వరకు ఎన్ఎస్‌పీ కాలువ పైన జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. కోనంకి సబ్ డివిజన్ ఎన్ఎస్‌పీ సాగర్ కాలువలో అక్కడక్కడ విపరీతంగా చిల్లచెట్లు, తుమ్మచెట్లు పెరగడంతో ఎగువ నుండి దిగువకు నీటి ప్రవాహం సక్రమంగా రావడం లేదు.దాంతో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. జంగిల్ క్లియరెన్స్ పనులు నిమిత్తం నిధుల మంజూరుకు కూడా కృషిచేశారు. ఈ నిదులతో ఇప్పటికే బొల్లాపల్లి సాగర్ కాలువ జీఎస్‌టీ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. అదేవిధంగా దగ్గుబాడు మేజరులో పనులను చేపట్టారు. ప్రస్తుతం సాగర్ నీటి ప్రవాహం ఆగిపోవడంతో కాలువలో చెట్లును తొలగించడం సులభంగా మారింది. అదేవిధంగా మరో వారం రోజులు నాటికి పూర్తిగా జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యే వకాశాలు ఉన్నాయి. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు పెంట్యాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గద్దె అశోక్, నీటి సంఘం అధ్యక్షులు చిన్నం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పల్లెపోగు జాన్ తదితర నాయకులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు

బల్లికురవ. జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రోడ్ల వెంబడి పడవేసి ఉన్న చెత్తను లారీల ద్వారా తొలగించాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. సోమవారం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు చెత్తను లారీల ద్వారా నియోజకవర్గ కేంద్రంలో ఉన్న చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. ఎవరైన రోడ్ల వెంబడి చెత్త వేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఎవరైన గ్రామాలలో ఉన్న చెత్త సంపద కేంద్రాలలో మాత్రమే చెత్తను వేయాలన్నారు. అలానే ఇంటి పన్ను వసూళ్ల చేపట్టాలన్నారు. లక్ష్యం మేరకు ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లు చేయించాలన్నారు. అలానే ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ప్రతి ఇంటిపై సోలార్ యూనిట్లు ఏర్పాటుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు రాతపుస్తకాలు అందజేత

వేటపాలెం(చీరాల), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిషత్ ఎస్‌జెవైసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సుమారు రూ.15 వేలు విలువైన రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య విద్యాభ్యాసంతో ఉన్నత శిఖరాలు సాధ్యమని, ప్రతిఒక్కరూ గురుబోధనలు తప్పక ఆలకించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివశంకర్, అసోసియేషన్ ప్రతినిధులు సునీల్, దోగుపర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, పరీక్షలు చేసేవారిపై చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం కార్యాలయంలో సంబంధిత కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాన్‌సెంటర్‌లపై ప్రత్యేకనిఘా ఉంచాలన్నారు. ఏఎన్‌ఎం, ఆశావర్కర్‌లకు కచ్చితమైన సూచనలు చేయాలని చెప్పారు. రెండో కాన్పులో కూడా ఆడ శిశువుకు జన్మనిచ్చిన వారిపై నిఘా ఉంచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యల తప్పవని సూచించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి సలహాకమిటి చైర్మన్ డా.రత్న, మన్మోహన్, డా.సుభాషిణి, డా.షణ్ముఖశ్రీ, డా.యాకోబు, డా.బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా సాగిన మున్సిపల్ సమావేశం

అజెండాలోని 15 అంశాలు ఆమోదం





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, హాజరైన కౌన్సిలర్లు

అద్దంకి, జూన్30 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశం సోమవారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని మొత్తం 15 అంశాలను ఆమోదించినట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. సమావేశం సాదాసీదాగా సాగగా, మధ్యలో వైసీపీ కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావులు ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో మినీ బైపాస్ ఎలా అభివృద్ధి చేస్తారని, అద్దంకి కొండ వద్ద డంపింగ్ యార్డులో చెత్త మొత్తం తొలగింపు తరువాత ఆ ప్రాంతాన్ని ఏమి చేస్తారని అడిగారు. దీంతో కమిషనర్ రవీంద్ర సమాధానమిస్తూ ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేసిన తరువాత మున్సిపాలిటీ నుండి 10 సంవత్సరాల కాలంలో విడతల వారీగా బిల్లులు చెల్లిస్తారన్నారు.. అద్దంకి కొండ వద్ద సుమారు 7 ఎకరాలలో ఉన్న డంపింగ్ మొత్తం తొలగింపు పనులు జరుగుతున్నాయన్నారు. ఆ ప్రాంతంలో కొంతభాగంలో మెటిరియల్ రకవరీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు, మిగిలిన ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. అనంతరం పెద్దగా చర్చ లేకపోవడంతో కొద్ది సమయంలోనే సమావేశం ముగిసింది.



షమీమ్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న మురళీబాబు

జిల్లా ప్రజా రవాణా అధికారిణిగా షమీమ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణా అధికారిణిగా ఎస్‌కె షమీమ్ నగరంలోని ఆర్టీసీ ప్రజా రవాణా శాఖ జిల్లా కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె 2010లో ప్రకాశం జిల్లా పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. అక్కడ నుంచి నెల్లూరు-2 డిపో డీఎంగా బదిలీ అయ్యారు. జిల్లాలోనే పదోన్నతలు పొందుతూ నెల్లూరు రీజియన్ సీటీఈఎమ్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.జిల్లా ప్రజారవాణాధికారి మురళీబాబు రిటైర్డ్ కావడంతో ఆయన స్థానంలో షమీమ్‌ను నియమిస్తూ ఆర్టీసీ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం అందించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు జులై 13వ తేదీ లోపు ఆన్‌లైన్ పోర్టల్ nationalawardstoteachers.education.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పోర్టల్‌ను పరిశీలించాలని

నేడు దిశ సమావేశం

నెల్లూరు(జడ్పీ), జూన్30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని జిల్లాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న 68 పథకాలకు సంబంధించి ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సభ్యులు, జిల్లాస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.



సోమశిలలో నేటి నుంచి చేపల వేట నిషేధం

అనంతసాగరం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో మంగళవారం నుంచి మూడు నెలల పాటు చేపల వేట నిషేధించారు. ఈ మూడు మాసాలు చేప గుడ్డుదశలో ఉంటుంది. దీంతో చేపల ఉత్పత్తి పెంచేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. అయితే కొందరు వ్యాపారులు, జాలర్లు బయట వారిని పిలిపించి అక్రమ వేటకు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ప్రాజెక్టు లోతట్టులోని జనసంచారం లేని ప్రాంతాల నుంచి చేపలవేట సాగించి వెనుకవైపు కడప జిల్లా గోపవరం మండలం వద్ద అటవీ ప్రాంతం నుంచి గుట్టుగా తరలించేలా కార్యాచరణ చేసినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే రాబోవు రోజుల్లో చేపల వేటపై జీవనం సాగించే మత్స్యకారుల జీవనప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. నిషేధాన్ని పక్కాగా అమలు పరచి కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. కాగా, ఇటీవల మత్స్యశాఖ అధికారులు సోమశిలలో జాలర్లతో సమావేశమై నిషేధ సమయంలో చేపలవేట సాగించవద్దని గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు వ్యాపారులను పిలిపించి నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు ఉంటాయని సూచించారు.

● డ్యాంలో నీటి నిల్వ

సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 227 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటినిల్వ 33.128 టీఎంసీలుగా నమోదై ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు

నెల్లూరు(క్రైం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. ఎస్పీ కృష్ణకాంత్ బదిలీల ప్రక్రియను పర్యవేక్షించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి, నిబంధనలు అనుసరించి ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు నిర్వహిస్తున్నామన్నారు.

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ కోర్సుల్లో మార్పులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మధ్యాహ్నభోజనం అమలు, కళాశాలలు తెరిచే నాటికి పుస్తకాలు అందిస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల వైఫల్యం కారణంగా అడ్మిషన్ల సంఖ్య పూర్తిగా పడిపోయింది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది 2,185 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులపై ప్రత్యేక కథనం

అన్నీ ఉన్నా.. ప్రవేశంలో పతనం!

● ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు అంతంతే! ● టెన్త్‌లో ఉత్తీర్ణత 23,633 మంది, కళాశాలల్లో చేరిక 2,185 మందే..
● ప్రభుత్వం అందిస్తున్న వసతులపై కొరవడిన ప్రచారం ● అవగాహన లేక విద్యార్థుల 'ప్రైవేటు' బాట ● అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

నెల్లూరు (విద్య), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 23, ఎయిడెడ్ 2 కళాశాలలు కలిపి 25 కాలేజీలు ఉన్నాయి. ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి కొత్త విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. నీట్, జేఈఈ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేసింది. జూ.ఇంటర్ సబ్జెక్ట్‌లలో కొత్త సిలబస్‌ను రూపొందించారు. ప్రథమ, ద్వితీయ భాషలతోపాటు ప్రస్తుతం ఉన్న 4 సబ్జెక్టులు సైన్స్, 5 సబ్జెక్టుల ఆర్ట్స్ విభాగాల వ్యవస్థను ప్రక్షాళన చేసి నూతన ఎంబైపీసీ కాంబినేషన్‌ను ప్రవేశపెట్టారు. అలాగే ప్రథమ భాషగా ఇంగ్లీష్‌ను అందరికీ వర్తింపచేస్తుండగా, ద్వితీయభాష కోసం ప్రస్తుతం ఉన్న పది భాషల స్థానంలో అదనంగా సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో మరో 14 సబ్జెక్టుల ను ప్రతిపాదిస్తూ విద్యార్థికి ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే గ్రూపు సబ్జెక్టుల విభాగానికి వస్తే ఎంపీసీ గ్రూపు వి ద్యార్థులు అదనంగా బయాలజీని, బైపీసీ వారు అదనంగా మ్యాథ్స్ ను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. దీనిద్వారా ఎంబైపీసీ చదువుకుని జేఈఈ, నీట్ పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నారు. అలాగే ఒకేషనల్‌లో (వృత్తి విద్య) పలు కోర్సులు నిర్వహిస్తున్నారు. అయితే వీటిపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అడ్మిషన్లను పెంచడం లాంటి చర్యలను



ఇంటర్ బోర్డు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

● వందల్లోనే అడ్మిషన్లు

జిల్లాలో ఈ ఏడాది 23,633 మంది టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించారు. అయితే, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. జిల్లాలో 23 ప్రభుత్వ, 2 ఎయిడెడ్ కళాశాలలు ఉండగా వీటిలో జనరల్ కోర్సులు అన్ని కోర్సులు కలిపి ఏడు వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే గత విద్యా సంవత్సరం 3,500 మంది అడ్మిషన్లు జరగగా ఈ ఏడాది మరీ దారుణంగా 2,185 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా ఉంటుందని భావించినా అతి స్వల్పంగా చేరడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇంటర్‌బోర్డులో పనిచేసే అధికారులు, సిబ్బంది అందరూ తమ స్వలాభాల కోసమే పనిచేస్తున్నారని, వేతనాలు, అలవెన్స్‌లు మాత్రం లక్షల్లో తీసుకుంటూ అడ్మిషన్లను, విద్యార్థుల సంక్షేమాన్ని మాత్రం మరిచిపోతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నా రు. నగరంలోని డీకే బాలికల జూనియర్ కళాశాలలో 621 మంది విద్యార్థినులు, కేఎసీ కళాశాలలో 250 మంది, ఆత్మకూరులో 134, కందుకూరులో 131, కోవూరులో 109, ఉదయగిరిలో వందమంది అడ్మిషన్లు మినహా ఏ ఒక్క కళాశాలలోనూ 50కు మించి అడ్మిషన్లు లేకపోవడం, అతితక్కువగా వెంకటాచలంలో 45 మంది, ఇనమడుగులో 20 మంది అడ్మిషన్లు జరిగాయి.

● రేషనలైజేషన్ ఎఫెక్ట్

కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గడం, విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు తరలివెళ్లడం వంటి ఘటనలతో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో 11 పోస్టులను రేషనలైజేషన్ కింద తీసేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నెల్లూరులోని కేఎసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9 పోస్టులు, విడవలూరు కళాశాలలో 2 పోస్టులు తొలగించారు. కేఎసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం చుట్టూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇవ్వడం, ప్రైవేట్, కార్పొరేట్‌లను ప్రోత్సహించడంతో విద్యార్థులంతా వీటికి తరలి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వ కళాశాలకు సుదూరంలో మాత్రమే అనుమతులివ్వాల్సిన బోర్డు అధికారులు కళాశాల పక్కనే ఎలా అనుమతులిస్తారని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కళాశాలలకు అధికంగా అనుమతులు ఇవ్వడం కూడా ప్రభుత్వ ఇంటర్ ప్రవేశాలపై ప్రభావం చూపిందన్న ఆరోపణలున్నాయి. ఇంటర్‌బోర్డుకు సంబంధించి ఆర్‌ఐఓ కళాశాలల అనుమతులు, వసతుల కల్పన, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తారు. అలాగే డీఐఈఓ అడ్మిషన్ల ప్రక్రియ, కొత్త భవనాలు, తరగతిగదుల నిర్మాణాలు, ఇతర అంశాలను పరిశీలిస్తారు. అయితే ఆర్ఐఓ మాత్రం జిల్లాలో ఉంటుండగా, డీఐఈఓ మాత్రం జిల్లాకు నియమితులైనా రాష్ట్ర పరీక్షల విభాగం పరిశీలకులుగా కూడా పని చేస్తుండడంతో ఆయన నెలకో సారి మాత్రమే అందుబాటులో ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి జూనియర్ ఇంటర్ కళాశాలల మనుగడను కాపాడాలని, రెండో విడతలో అయినా అడ్మిషన్లు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై, అనుమతులిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒక్కడే!

నెల్లూరు (క్రైం) (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కు జనం తరలివచ్చారు. వారంతా ఉదయం 9 గంటలకే చేరుకున్నారు. గంటలు గడుస్తున్నా అధికారులు రాలేదు. చాలాసేపు తర్వాత మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుబ్బారావు వచ్చి ఫిర్యాదులు స్వీకరించడం ప్రారంభించారు. చివర్లో నగర డీఎస్పీ సింధుప్రియ వచ్చి కొన్ని ఫిర్యాదులను స్వీకరించారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న మహిళా స్టేషన్ సీఐ

పుట్టింటికి తరలిన కలిగిరమ్మ

మూడు గ్రామాల గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్ల రెండో రోజు ఆలయంలో వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారు మేళతాళాల మధ్య, ముద్రగడ పావనం, వీరతాళ్లు, ఆవు, ఎద్దు వాహనాలు వెంటరాగా అమ్మవారు పుట్టినిల్లైన పాపనమునిసిలిపాలెం గ్రామోత్సవానికి తరలి వెళ్లారు. గ్రామోత్సవం అనంతరం తిరిగి మంగళవారం ఉదయానికి అమ్మవారు ఆలయానికి చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి



కలిగిరిలో ఊరేగింపు మధ్య పుట్టినింటికి తరలివెళ్తున్న అమ్మవారు

ఇరిగేషన్ అధికారుల మెడకు 'సర్వేపల్లి' కేసు

● ముగ్గురిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఆదేశం

నెల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో చేసిన పాపాలు ఇరిగేషన్ అధికారులను కూడా వెంటాడుతున్నాయి. నాడు అధికార దర్పంతో వైసీపీ నాయకులు విచ్చలవిడి దోపిడీకి పాల్పడగా, వారిని అడ్డుకోవడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమయ్యారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో జరిగిన గ్రావెల్ దోపిడీనే ఇందుకు నిదర్శనం. ఏకంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరుతో ఫోర్జరీ సంతకాలతో గ్రావెల్ తవ్వకాలకు దరఖాస్తు చేసుకోగా ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇచ్చేశారు. ఇలా రూ.కోట్ల మట్టి, గ్రావెల్‌ను కొల్లగొట్టారు. ఈ అక్రమ వ్యవహారంపై ఇటీవల ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. నాడు వెంకటాచలంలో నమోదైన కేసును బాపట్ల డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటైన సిట్‌కు బదిలీ చేశారు. ఈ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆయన అనుచరుడు నిరంజన్‌రెడ్డిలతో మరికొంత మంది నిందితులుగా ఉన్నారు. వీరిద్దరినీ ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం దర్యాప్తు వేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే శాఖాపరమైన చర్యలకు ఇరిగేషన్ శాఖ పూనుకుంది. అప్పట్లో పనిచేసిన అధికారులను బాధ్యులను చేస్తూ చర్యలకు ఉపక్రమించింది. సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగిందని వాస్తవమని తేల్చిన ఈఎన్‌సీ, ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో ప్రభుత్వానికి రెండు నివేదికలు అందజేశారు. ఆ నివేదికల ఆధారంగా అప్పటి సెంట్రల్ డివిజన్ ఈఈ కృష్ణమోహన్, నెల్లూరు డీఈఈ పెంచలయ్య, బ్రహ్మదేవి సెక్షన్ ఏఈ ప్రసాద్‌లపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల క్రమశిక్షణ నిబంధనల ప్రకారం ఈ ముగ్గురు అధికారులకు మేజర్ పెనాల్టీ విధించే విధంగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేజర్ పెనాల్టీ ఏ స్థాయిలో ఉంటుందన్నది తెలియాల్సి ఉంది. ఈ వ్యవహారం ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఎలక్ట్రిక్ బస్సులు రయ్.. రయ్!

● నెల్లూరు 2వ డిపోకు 100 కేటాయింపు ● 12 మీటర్ల పొడవైనవి 64, 9 మీటర్లవి 36

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు రయ్.. రయ్‌మంటూ రోడ్లపై తిరగనున్నాయి. ఇప్పటికే నెల్లూరు-తిరుపతి మధ్య నడుస్తున్న బస్సులకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో నెల్లూరు రీజియన్ నెల్లూరు రెండవ డిపోకు కేంద్ర ప్రభుత్వం 100 ఎలక్ట్రికల్ హయిర్ బస్సులను కేటాయించింది. ఈ బస్సులు అతి త్వరలోనే రీజియన్‌కు చేరనున్నాయి.



● 12 మీటర్ల పొడవైన బస్సులు

నెల్లూరు రీజియన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బస్సుల్లో 12 మీటర్ల పొడవైన బస్సులు 64, 9 మీటర్ల చిన్న బస్సులు 36 ఉన్నాయి. ప్రస్తుతం నెల్లూరు-తిరుపతి మధ్య తిరుగుతున్న ఎలక్ట్రికల్ బస్సులు 9 మీటర్ల పొడవు ఉన్నాయి. కేంద్రం నుంచి రానున్న 12 మీటర్ల పొడవైన బస్సులను ఆర్టీసీ అధికారులు చెన్నై, విజయవాడ, తిరుపతి నగరాలకు నడిపేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

● చార్జింగ్ పాయింట్ల పరిశీలన

నెల్లూరు రెండవ డిపో గ్యారేజ్‌లో ఇప్పటికే తిరుపతి డిపోకు చెందిన విద్యుత్ బస్సుల కోసం చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి ఉన్నారు. కొత్తగా వచ్చే ఎలక్ట్రికల్ బస్సుల కోసం రెండవ డిపో గ్యారేజ్‌లోనే చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారుల గ్యారేజీలో ఎక్కడ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలి, ఎంత విద్యుత్ వాటికి అందించాలి అన్న అంశాలపై పరిశీలించారు. ఈ క్రమంలో కొద్ది రోజుల్లోనే చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు పూర్తి కానుంది. ఇక బస్సులు వచ్చిన వెంటనే రోడ్లపై ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు పరుగులు తీయనున్నాయి.

పచ్చని కాపురంలో అనుమానం చిచ్చు!

● మద్యం మత్తులో కత్తితో వీరంగం ● దుత్తలూరు మండలంలో దారుణం

● తొలుత భార్యపై దాడి ● అడ్డొచ్చిన అత్తామామలపై కత్తివేటు.. అక్కడికక్కడే మృతి

● భార్యకూ తీవ్రగాయాలు ● పరారీలో నిందితుడు

అనుమానం పెనుభూతమైంది. మద్యానికి బానిసను చేసింది. పచ్చని సంసారంలో చిచ్చుపెట్టి ఇద్దరి మృతికి కారణమైంది. నిండునూరేళ్లు తోడి నీడగా ఉంటానన్న భర్తే ఆ కుటుంబం పాలిట యమకింకరుడిగా మారాడు. మద్యం మత్తులో భార్యపై, అడ్డొచ్చిన అత్తామామలపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో వృద్ధ దంపతులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కొనఊపిరితో ఇల్లాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దుత్తలూరు మండలం కమ్మవారిపాళెం గ్రామ సమీపంలోని ఏసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.





మృతులు జయమ్మ, కల్లయ్య (ఫైల్)

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆనం చెంచుసుబ్బారెడ్డి (ఏసీ) కాలనీకి చెందిన ఏలూరి వెంగయ్యకు వెంకాయమ్మతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి శ్రావ్య, మనోహర్, శ్రీవల్లి అనే ముగ్గురు సంతానం. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ పిల్లల్ని చదివించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గత కొన్నినెలలుగా వెంగయ్య తన భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ మద్యానికి బానిసై తరచూ వివాదానికి దిగేవాడు. ఆదివారం రాత్రి వెంగయ్య పూటుగా మద్యం సేవించి అత్తామామల ఇంట్లో ఉన్న వెంకాయమ్మతో వివాదానికి దిగాడు. అడ్డొచ్చిన అత్తామామలు చలంచర్ల జయమ్మ(59), కల్లయ్యల(64)లపై విచక్షణారహితంగా దాడి చేయడంతో వారు అక్కడికక్కడే మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.

● మద్యం మత్తులో అంతమొందించి

ఆదివారం వెంకాయమ్మ కాలనీవాసులతో కలిసి వింజమూరు మండలం గుండెమడగల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లింది. పని ముగించుకుని సాయంత్రం ఇంటికొచ్చిన భార్యతో రోజులాగే వెంగయ్య కోపోద్రిక్తుడై వివాదానికి దిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దుత్తలూరు సెంటర్‌కు వెళ్లిన అతను పూటుగా మద్యం సేవించి ఇంటికొచ్చాడు. ఇంట్లో వెంకాయమ్మ లేకపోవడంతో మచ్చుకత్తి తీసుకుని తన అత్తామామల ఇంటికెళ్లి వివాదానికి దిగాడు. అడ్డొచ్చిన అత్తమామలను దీనంతటికి మీరే కారణమని వారిపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. దీంతో వారు అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయారు. భార్యను సైతం కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. ఆమె కేకలు విన్న కాలనీ వాసులు అక్కడికి చేరుకోవడంతో వెంగయ్య కత్తితో పరారయ్యాడు.

● దిక్కుతోచని స్థితిలో పిల్లలు

వెంకాయమ్మ పిల్లలు శ్రావ్య, మనోహర్, శ్రీవల్లి స్థానిక పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. తండ్రి చేసిన వీరంగంతో అక్కున చేర్చుకునే అవ్వాతాతలు దూరమయ్యారు. తల్లి తీవ్ర గాయాలపాలై వైద్యశాలలో ఉండటం, తండ్రి జైలుకెళ్లనుండటంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. బిక్కమొహం వేసుకుని ఉన్న ఆ పిల్లల్ని చూసి కాలనీవాసుల గుండె తరుక్కుపోయింది.



హత్యలు జరిగింది ఈ ఇంట్లోనే.. పక్కనే కల్లయ్య మృతదేహం

● నిందితుడి కోసం పోలీసుల గాలింపు

సమాచారం అందుకున్న వెంటనే ఉదయగిరి సీఐ వెంకటరావు, దుత్తలూరు, వరికుంటపాడు ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, రఘునాథ్‌లు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. కాలనీ వాసుల నుంచి వివరాలు రాబట్టారు. రెవెన్యూ అధికారులతో కలిసి పంచనామా నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. మృతదేహాలను అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. నిందితుడి ఆచూకీ కోసం లుకవుట్ నోటీసులు సైతం జారీ చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 590

ఎన్జీవో కాలనీ ఏర్పాటు చేయాలి

కావలిటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఎన్జీవో కాలనీ ఏర్పాటు చేయాలని సోషల్ రిఫార్మర్స్ కోరారు. సోమవారం పట్టణంలోని కృష్ణం రాజేశ్వరమ్మ కల్యాణ మండపంలో సోషల్ రిఫార్మర్స్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల సమావేశం జరిగింది. సామాజిక పర్యావరణ, విద్య, ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, ప్రకృతి వైపరీత్యాల సహాయ సహకారాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ పొందిన స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఎన్జీవో కాలనీ, కార్యాలయం ఏర్పాటు తదితర ప్రధాన డిమాండ్లతో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి చర్చలు జరపాలని తీర్మానించారు. సమావేశంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఎండీ రెహెమాన్, ఖాదర్‌బీ, చేవూరి చిన్న, అబ్దుల్ అలీం, తోట వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, వినయ్‌కుమార్, సాయితేజ, రాయపాటి దిలీప్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్)లో డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆర్డీవో ఎం. సన్నీ వంశీ కృష్ణకు వినతిపత్రాలు అందచేశారు.

● దివ్యాంగులందరికీ ఇళ్ల వద్దకే రేషన్ బియ్యం అందివ్వాలనే ప్రభుత్వ లక్ష్యం ఆచరణలో నెరవేరడం లేదని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నవ వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు దివ్యాంగులతో కలిసి కావలి ఆర్డీవోకి ఎక్కడక్కడ రేషన్ అందటం లేదో వాటి వివరాలతో సహా వినతిపత్రం అందచేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో వెంటనే సంబంధిత సిబ్బందితో మాట్లాడి వెంటనే రేషన్ అందే ఏర్పాట్లు చేయిస్తానని చెప్పారు.


దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

● కావలి పట్టణానికి చెందిన ఒక పేపర్‌బాయ్ సతీమణి వీ శాంతి తన ఇద్దరి పిల్లలను ఓ పాఠశాలలో చదివిస్తుండగా అధిక ఫీజులు చెల్లించలేక మరొక పాఠశాలలో చేర్పించేందుకు టీసీ అడిగితే ఈ ఏడాది పూర్తి ఫీజులు కడితేనే టీసీలు ఇస్తామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చెపుతున్నారని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. టీసీలు ఇస్తే కాని ప్రస్తుతం తాము చేర్పించిన పాఠశాలలో తల్లికి వందనం రావడం లేదన్నారు. పేద కుటుంబమైనందున తాము పాత పాఠశాలలో ఫీజులు చెల్లించలేమని తమ పిల్లలకు టీసీలు ఇప్పించాలని కోరారు.

● డివిజన్ కేంద్రమైన కావలిలో ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలలు లేవని, వాటిని ఏర్పాటు చేయించాలని బీసీ ఐక్యత భవన్ నేతలు అద్దంకి ప్రభాకర్, చిన్ని వరప్రసాద్, ఉరిటి గోవింద్‌లు ఆర్డీవోకు వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వ కళాశాలలు లేనందున ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి చదవలేక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.


పునాదులకే పరిమితమైన అన్నెబోయినపల్లి యూపీ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం


లింగసముద్రం ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులు చేసిన గదులకు వేయని రంగులు

సరస్వతీ నిలయాల్లో సమస్యల తిష్ఠ!

● అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

లింగసముద్రం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సరస్వతీ నిలయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు ఫేస్-2లో నిర్మాణ పనులు చేపట్టిన పలు పాఠశాలల తరగతి గదుల పనులు వివిధ దశలలో అసంపూర్తిగా నిలిచి పోయాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 37 ప్రాథమిక, 3 యూపీ పాఠశాలలు, 4 జడ్పీ హైస్కూళ్లు, ఒక కేజీబీవీ, ఒక ఏపీ మోడల్ స్కూల్, ఒక గురుకుల పాఠశాల ఉన్నాయి. ప్రస్తుతం 47 పాఠశాలలో 3,379 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో తరగతి గదులు చాలక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2లో అనేక పనులు చేపట్టారు. అయితే మంజూరు చేసిన నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం తో అనేక పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అందులో మండలంలోని మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో 2 తరగతి గదుల నిర్మాణాలకు రూ.24 లక్షలు మంజూరు కాగా, వాటి నిర్మాణాలకు రూ.8 లక్షలు ఖర్చు చేశారు. అలాగే అన్నెబోయినపల్లి యూపీ పాఠశాలలో 4 గదుల నిర్మాణాలకు రూ.48 లక్షలు మంజూరు కాగా రెండు గదుల బేస్‌మెంట్ల నిర్మాణాలకు రూ.8 లక్షలు ఖర్చు చేశారు. పెదపవని ఉర్దూ యూపీ పాఠశాలలో 5 గదుల నిర్మాణాలకు రూ.60 లక్షలు మంజూరు కాగా, రూ.20 లక్షలతో రెండు గదులు నిర్మించి, మిగిలిన 3 గదుల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. పెదపవని జడ్పీ హైస్కూల్‌లో 2 గదుల నిర్మాణాలకు రూ.24 లక్షలు మంజూరు కాగా, రెండు గదుల నిర్మాణాలకు రూ.20 లక్షలు ఖర్చు చేశారు. లింగసముద్రంలోని కేజీబీవీలో 8 తరగతి గదుల భవన నిర్మాణాలకు రూ.96 లక్షలు మంజూరు కాగా, సుమారు రూ.40 లక్షలు 4 గదుల నిర్మాణాలకు ఖర్చు చేశారు. మిగిలిన నాలుగు గదుల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణాల పూర్తికి నిధులు విడుదల చేయకపోవడంతో ఇవి అసంపూర్తిగా నిలిచి పోయాయి. అంతేకాక నాడు-నేడు ఫేస్-1 కింద కూడా నిర్మించిన, మరమ్మతులు చేపట్టిన పలు పాఠశాలల తరగతి గదులు, బాతురూంలకు రంగులు వేయకుండా వదిలివేశారు. ఈ విషయమై అప్పటి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్‌ను వివరణ కోరగా మండలంలో నాడు-నేడు ఫేస్-2 కింద మంజూరైన తరగతి గదుల నిర్మాణ పనులకు పనులు చేసినంత వరకు 2024 మార్చిలో ప్రభుత్వం బిల్లులు విడుదల చేసింది. మిగిలిన భవనాల పనుల పూర్తికి నిధులు విడుదల కాక పోవడంతో పనులు నిలిచి పోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలి

బిట్రగుంట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బోగోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అబ్దుల్ జహీర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై విచారణ చేపట్టాలని జిల్లా అధికారులను కోరినట్లు బోగోలు మాజీ ఉపసర్పంచు వీరరఘు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమాచార చట్టం కింద అడిగిన సమాచారంలో అనేక లొసుగులు ఉన్నాయ ని, దీనిపై ప్రజల సమక్షంలో విచారణ చేపట్టాలని కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యా దు చేసినట్లు తెలిపారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శిం చేందుకు ఈనెల 3వ తేదీన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు ఎం.శ్రీనివాసులు. ఎకే.సుందర్ రాజు, పీ.అంకులయ్య, సురేంద్రరెడ్డి, ఎం. సాల్మన్ రాజు, కళ్యాణ్, టీ.రమణయ్య, నవాజ్, టీ.వెంకయ్య, రసూల్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ ప్రభాకర్‌ను కలిసిన టీడీపీ, బీజేపీ నేతలు

బిట్రగుంట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన ఎన్.ప్రభాకర్‌ను సోమవారం టీడీపీ, బీజేపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు వీ.శ్రీనివాసులు, నేతలు కే.వెంకటేశ్వర రెడ్డి, ఏ.ఆదిశేషయ్య, పీ.సుబ్బారావు, ఎన్ఎస్ యాదవ్, జీ.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

కావలిటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్ కోరారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు డీఈ సాయిరాంను కలిసి కార్మికులు సమ్మెలో వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తురకా శీనయ్య, బీ రమేష్, ఎం బాలయ్య, కె బాబు, రమేష్, అలేఖ్య పాల్గొన్నారు.

160 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 423 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 263 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-144, ఆర్ఆర్-4, సీఆర్-7, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 160 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.215.29గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

3న ద్విచక్రవాహనం వేలం

కావలి రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో సీజ్ చేసిన హోండా గ్రాజియా ద్విచక్ర వాహనానికి ఈనెల 3వ తేదీన కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 10 శాతం ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

పేదలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం

● రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ

అల్లూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. మండలంలోని నార్త్‌మోపూరు సమీపంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌ను ఆయన సోమవారం సందర్శించారు. విద్య, వైద్యం, వృత్తి నైపుణ్యాలపై పేదలకు చేస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి-4 కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ధనికుల్లో ముందుండే పది మంది అట్టడుగున ఉన్న పేద కుటుంబాలకు బాసటగా నిలిచి వారిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఆయన మాటలను అనుసరిస్తూ నెల్లూరులోని వీఆర్ హైస్కూలును తాను అభివృద్ధి చేశానన్నారు. ఇదే స్ఫూర్తితో డీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి నెల్లూరు మూలాపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌ను అభివృద్ధి చేస్తామని ముందుకొచ్చారని, ఆయనకు ప్రభుత్వం తరపున ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, స్థానిక నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, అడ్మిన్ మేనేజర్ అనిల్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి నారాయణకు పూలమొక్క అందజేస్తున్న ట్రస్ట్ అధినేత సుధాకర్‌రెడ్డి, బీద గిరిధర్ తదితరులు

తండ్రి విగ్రహావిష్కరణకు తనయుడికి ఆహ్వానం

● రేపు కావలిలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహావిష్కరణ

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డులో ఏర్పాటు చేసి ఉన్న వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహావిష్కరణ ఈనెల 2వ తేదీన జరుగుతోంది. ఈ విగ్రహావిష్కరణకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కాపునేతలు, రంగా అభిమానులతో కలిసి సోమవారం విజయవాడలో రంగా తనయుడు రాధాకృష్ణను కలిసి ఆహ్వానించారు. ఆయనను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు.


వంగవీటి రాధాకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి

ఇంటింటికి టీడీపీని విజయవంతం చేయండి

● నేతలతో ఎమ్మెల్యే ఇంటూరి సమీక్ష

కందుకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు వివరించేం దుకు ఈనెల 2 నుంచి ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియచేయాలన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలియచేసి ఇంకేమైనా స్థానిక సమస్యలు ఉంటే గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేద్దామని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

రూ.1.25 కోట్లతో అభివృద్ధి పనులు

కందుకూరు పట్టణాన్ని మోడల్ మున్సిపాలటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి పామూ రు రోడ్ సర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపులా రహదారి విస్తరణ, సెంట్రల్ డివైడర్ పనులకు రూ.1.25 కోట్లతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. అలాగే జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలం ఎదురుగా రూ.50 లక్షలతో నిర్మించిన నూతన పార్కును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, డీఈ గణపతి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, మదాల లక్ష్మీనరసింహం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సాంస్కృతిక పోటీల ప్రారంభం

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవాల సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలలో సాంస్కృతిక పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ భవనంలో కావలి రెడ్‌క్రాస్ పోషకసభ్యులు కళాబంధు మన్నెమాల గోవిందరెడ్డి, ఎవేత్త డీవీ ఫణికుమార్, ప్రముఖ గాయకులు సూరిశెట్టి రామచంద్రరావు, టంగుటూరి జయశ్రీలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులలో రక్తదానంపై అవగాహన పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు పోటీలను నిర్వహించి ఆదివారం బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలకమండలి సభ్యులు ఓరుగం టి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్న కుమార్, తలసేమియాడేకేర్ సెంటర్ సభ్యులు కల్లయ్య, జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు తోట వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసిన రెడ్‌క్రాస్ బాధ్యులు

వ్యవసాయ రుణాలకు అధిక ప్రాధాన్యం

కలిగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు శాఖల్లో ఖాతాదారుల సౌకర్యార్థం పట్టణాల బ్యాంకులకు దీటుగా సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆబ్యాంక్ తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మిత్తాన్వయ పేర్కొన్నారు. కలిగిరి కెనరాబ్యాంక్ శాఖ ఆధునీకరణ చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లూరు రీజియన్ ఏజీఎం అదారి నాగరాజు మాట్లాడుతూ కెనరాబ్యాంకు కలిగిరి శాఖ 12ఏళ్లల్లో రూ.100కోట్ల లావాదేవీల మైలురాయి దాటిందని పేర్కొన్నారు. తమ బ్యాంకు ద్వారా వ్యవసాయ, వ్యసాయేతర రుణాలేకాకుండా మహిళలకు, విద్యార్థులకు ప్రత్యేక రుణాలు అందిస్తున్నామన్నారు. అదేవిధంగా జీరో బ్యాలెన్స్‌తో ఖాతా నిర్వహించుకుంటూ బీమా సౌకర్యం కూడా పొందవచ్చని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వెంగళరావు, భవన నిర్మాణ యజమాని సానా వెంకటేశ్వర్లు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.


రైతులను సన్మానిస్తున్న కెనరాబ్యాంకు అధికారులు

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు


బహుమతి అందుకున్న విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

జలదంకి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జలదంకి హైస్కూల్‌లో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగదు బహుమతులు అందించారు. అలాగే హైస్కూల్ ఉపాధ్యాయుడు వేలమూరి కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ చేయగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మద్దుల మాల్యాద్రి లక్ష్మీనరసింహ లక్ష్మీకాంతమ్మ మెమోరియల్ తరుపున 572 మార్కులు సాధించిన ద్రోణాదుల వైష్ణవికి రూ.15వేల, 552 మార్కులు సాధించిన మారుబోయిన లక్ష్మీప్రత్యూషకు రూ.10వేల, 549 మార్కులు సాధించిన ఎం.సింధుకు రూ.5వేల సంఘం గౌరవాధ్యక్షుడు మద్దుల వెంకటనరసింహం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోర్సిపాటి హరినారపరెడ్డి, ట్రెజరర్ సురే వెంకటశేషారెడ్డి, సభ్యులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న వెంగమాంబకు సారె

కొండాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మకు జరుగుతున్న సారె కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సమరసత ఫౌండేషన్ జిల్లా మహిళా సహ కన్వీనర్ మాలేపాటి స్రవంతి భక్తులను కోరారు. జూలై 17వ తేదీన జరిగే కార్యక్రమానికి సంబంధించిన వెంగమాంబ పేరంటాల ఆహ్వాన పత్రాలను సోమవారం మండలంలోని సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం గ్రామంలో ఫౌండేషన్ సభ్యులతో కలసి భక్తులకు ఆమె అందచేశారు. ఆమె వెంట ఫౌండేషన్ మండల సహ కన్వీనర్ సోమినేని రవీంద్రబాబు, భజన గురువు మన్నేపల్లి రమణయ్య, చల్లా వెంకటేశ్వర్లు, బొల్లినేని వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు

బిట్రగుంట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు నిర్వహిస్తుందని వైద్యులు ఎస్. రామకృష్ణ అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జక్కేపల్లి గూడూరు పంచాయతీ ఏబీ కండ్రికలో డాక్టర్ జిహారిక, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో రామకృష్ణ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించి ఉచిత వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం సిబ్బందితో పాటు 104, ఆశా వర్కులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు సోమవారం డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు తదితరు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన కాలనీలలోని పిల్లలు బడిలో ఉండాలని ఎక్కడా పనులలో ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏటూరు రామిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ డీ.మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ శారద పాల్గొన్నారు.


విద్యా సామగ్రి అందజేస్తున్న దాతలు

యానాది కాలనీల్లో పాఠశాలలను ఎత్తివేయవద్దు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): యానాదికాలనీల్లో ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయవద్దని దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ బోగోలు మండలం కొండ బిట్రగుంట యానాదికాలనీలో 46 మంది యానాది విద్యారులున్న పాఠశాలను పక్క గ్రామంలోని పాఠశాలలో కలిపి వేశారన్నారు. ఇది దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. యానాది కాలనీల్లో ఉన్న పాఠశాలలను అక్కడే ఉంచి ప్రాథమిక విద్యను అందివాలని కోరారు. 80 శాతం మంది పిల్లలకు తల్లికి వందనం రాలేదన్నారు. ఈ ధర్నాలో కొండబిట్రగుంటకు చెందిన మహిళలతోపాటు, నాయకులు ఎస్. లక్ష్మయ్య, అశోక్, రాచగిరి మురళి, పీ.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

లింగసముద్రం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పాఠశాల విద్య-ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్‌పై ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అందరూ ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను చేర్పించాలన్నారు. ఎంఈవో-2 శివకుమార్ మాట్లాడుతూ బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించి డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. తల్లిదండ్రులకు పాఠశాల విద్య యొక్క ప్రాధాన్యత గురించి వివరించాలన్నారు.. త్వరలో ప్రభు త్వం నిర్వహించే మెగా పేరెంట్ సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వృద్ధురాలి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

కావలి రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేరళ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్తూ 60 ఏళ్ల వృద్ధురాలు నిషాద్ రామ్‌దులారి తప్పిపోయిందని సోమవారం 1వ పట్టణ సీఐ ఫిరోజ్‌కు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హమీర్‌పూర్ జిల్లా పడోరి గ్రామానికి చెందిన రామ్‌దులారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. తామంతా కేరళ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి వెళుతుండగా మే 19వ తేదీన నెల్లూరులో తప్పిపోయిందని, దీంతో ఆమె కోసం అప్పటి నుంచి వెతుకుతున్నామని ఆమె కుమారుడు దీపక్ పేర్కొన్నారు. ఈ మేరకు గోడపత్రులు కూడా అంటించారు.

చిత్రజ్యోతి
SINCE 1965

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రానా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

\- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫీమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

లారీలో నుంచి పడి క్లీనర్ మృతి

కోవూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోవూరుకు సమీపంలోని నందలగుంట వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న లారీలో నుంచి కిందపడి క్లీనర్ మృతి చెందిన ఘటన సోమవారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తిరుపతి పట్టణంలోని లీలామహల్ సెంటర్ ప్రాంతానికి చెందిన నాగరాజు (65) చాలా కాలం నుంచి లారీ క్లీనర్‌గా జీవనం సాగిస్తున్నారు. పది రోజుల కిందట లారీలో తిరుపతి నుంచి రాయపూర్‌కు వెళ్లాడు. తిరిగి రాయపూర్ నుంచి ఐరన్‌ఓర్ లోడుతో చెన్నైకి వెళుతుండగా నిద్ర మత్తులో లారీలో నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. వేగంగా వెళ్తున్న లారీ నుంచి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ రంగ నాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో లారీడ్రైవర్...

నెల్లూరురూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో లారీ డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన సోమవారం వెలుగు చూసింది. రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు, తమిళనాడులోని శీలం సమీపాన ఉన్న పట్టిపశయం ప్రాంతానికి చెందిన రాజశేఖరన్ (46) పదేళ్లగా లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెన్నై నుంచి ఎక్స్‌కవేటర్ విడిభాగాలను విజయవాడకు తీసుకెళ్లి అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. అల్లీపురంలోని రైస్‌మిల్లులోని ధాన్యం లోడ్ చేసుకునేందుకు ఆదివారం వచ్చాడు. కూలీలు సోమవారం వస్తారని, అప్పటి వరకు మిల్లువద్దే ఉండాలని మిల్లు సిబ్బంది చెప్పడంతో అక్కడే వండుకుని తిని లారీ కేబిన్‌లో పడుకున్నాడు. నిద్రలోనే గుండెపోటుకు గురై మరణించినట్లు సోమవారం గుర్తించామని సీఐ పేర్కొన్నారు. అతడి భార్య గోమతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెల్లువెత్తిన అర్జీదారులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి అర్జీదారులు పోటెత్తారు. రికార్డు స్థాయిలో 480 వినతులు రావటం విశేషం. వీటిలో రెవెన్యూశాఖవి 186, సర్వేశాఖకు 48, సివిల్ సప్లయిస్‌వి 14 అర్జీలు, మిగిలినవి వివిధశాఖలకు సంబంధించినవి ఉన్నాయి. అర్జీదారుల నుంచి కలెక్టర్ ఆనంద్‌తోపాటు, జేసీ కార్తీక్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని సంతృప్తికరంగా పరిష్కరించాలని ఆదేశించారు. గడువులోగా అర్జీలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం చూపించలేని అర్జీలకు ఎందుకు పరిష్కరించలేదో సదరు అర్జీదారులకు వివరించాలని పేర్కొన్నారు. కలెక్టర్‌కు అందిన అర్జీల్లో కొన్నింటి వివరాలు...



అర్జీదారుడి సమస్యను వింటున్న కలెక్టర్ ఆనంద్

- కనిగిరి-దువ్వూరు గాంధీ గిరిజన సంఘం మత్స్యకార సహకార సంఘం సభ్యుల సమస్యలు పరిష్కరించాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.
- ఉలవపాడు మండలం కరేడు గ్రామ మహిళలు సంతృప్తి చెందేలా ఇండోసోల్ కంపెనీ ఏర్పాటుకు నిర్ణయాలు తీసుకోవాని బీజేపీ నేత మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.
- ముత్తుకూరులోని అంబేడ్కర్ గురుకులానికి నాణ్యత లేని సరుకులను సరఫరా చేశారని, ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దళిత సంఘం నాయకులు కొప్పోలు రఘు, శేషం సుదర్శన్ వినతిపత్రం సమర్పించారు.
- ఎరుకుల కులస్థుల కోసం ప్రత్యేకంగా ఏకలవ్య భవనాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కలెక్టర్ ఆనంద్‌కు అర్జీ ఇచ్చారు.

సీనియారిటీ జాబితా ప్రకటించాలి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 30(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రేడ్-2 వీఆర్వోల సీనియారిటీ జాబితా ప్రకటించి, బదిలీలు చేపట్టాలని గ్రేడ్-2 వీఆర్వోలు కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వినతికి కలెక్టర్ స్పందించారన్నారు. బదిలీల జీవో 5, 6లో పొందుపరచిన పాయింట్ల ప్రకారమే బదిలీలు జరుగుతాయని చెప్పారన్నారు. దివ్యాంగుల, స్పౌజ్ ఆప్షన్స్‌ల వారికి కూడా వారికున్న వెసులుబాటు ప్రకారమే బదిలీలు జరుగుతాయని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, లక్ష్మణ్‌రెడ్డి, గౌస్, తేజ, శ్రీహరి, సీహెచ్ కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలియజేస్తున్న వీఆర్వోలు

ఇండోర్ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకురండి

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండలం మొగళ్లపాలెం వద్ద ఆరేళ్ల క్రితం నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ క్రికెట్ స్టేడియాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని డీవైఎఫ్ఐ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు బీవీ నరసింహ, ఎంవీ రమణ మాట్లాడారు. మొగళ్లపాలెంలో ప్రభుత్వం 157 ఎకరాలను తీసుకున్నదని, ఆరేళ్లయినా నేటికీ నిర్మాణాలు అందుబాటులోకి రాలేదన్నారు. వెంటనే వాటిని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు జగదీష్, శేఖర్, యశ్వంత్, రాజేష్ తదిదరులు పాల్గొన్నారు.

దళితుల సాగులోని భూములకు పరిహారం చెల్లించాలి

● కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : దళితుల సాగులో ఉన్న విమానాశ్రయ భూములకు పరిహారం చెల్లించాలని దగదర్తి మండలం దామవరంకు చెందిన దళిత రైతులు సర్పంచు నిమ్మకాయల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ దామవరంకు చెందిన 250 దళిత కుటుంబాలు సుమారు 146 ఎకరాల భూమిని గత కొంత కాలంగా సాగు చేసుకుంటున్నామన్నారు. కొంత భూమిలో జామాయిల్ సాగు చేసుకుని ఇప్పటికే మూడు కటింగ్‌లు కూడా తీసుకున్నామన్నారు. మరి కొంత భూమిలో వరి, వేరుశనగ సాగు చేసుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. అయితే తమ ఆక్రమణలలో ఉన్న ఆ భూములకు పట్టాలు ఇవ్వమని అధికారులు చుట్టూ ఎన్ని పర్యాయాలు తిరిగినా ఏదో సమస్య చూపుతూ పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారన్నారు. ఆ భూములు ప్రస్తుతం దామవరం విమానాశ్రయ నిర్మాణానికి సేకరిస్తున్నందున తమ ఆధీనంలో ఉన్న భూములకు ఇతరులు పరిహారం కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులు సర్వే చేసి తమ సాగుబడిలో ఉన్న భూములను గుర్తించి తమకే పరిహారం ఇవ్వాలని చెప్పారు. పట్టాలు లేవని మరొకరికి పరిహారం ఇస్తే తాము భూములను విమానాశ్రయానికి ఇవ్వమని చెప్పారు. ఈ విషయంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని, ఎమ్మెల్సీ బీద రవిచంద్రను కూడా కలిసి వారికి విన్నవిస్తామని, వారు తమకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచు వట్టికాయల శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న రైతులు

డెంగ్యూను సమర్థంగా నివారించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డెంగ్యూ వ్యాధిని సమర్థవంతంగా నివారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత వైద్యాధికారులకు ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం జాతీయ డెంగ్యూ మాసోత్సవాల పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మంగళవారం నుంచి జూలై 31 వరకు డెంగ్యూ మాసోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. డెంగ్యూతోపాటు టైఫాయిడ్ జ్వరాలు రాకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా మలేరియా నివారణ అధికారిణి హుస్సేనమ్మ, ఎన్‌హెచ్‌ఎం పీవో డాక్టర్ రమేష్, సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.



డెంగ్యూ మాసోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, ఇతర వైద్యాధికారులు

జడ్పీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాన్ని అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(జడ్పీ), జూన్30 (ఆంధ్రజ్యోతి): జడ్పీలో కారుణ్య నియామకాలకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్‌పేట మండల పరిషత్ కార్యాలయ సబార్డినేటర్‌గా కొండలరావు, జిల్లా కార్యాలయంలో సబార్డినేటర్‌గా చైతన్యప్రకాష్‌రావు నియమితులయ్యారు.నియామక పత్రాలను వారికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు జడ్పీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భీమిరెడ్డి పాల్గొన్నారు.

అన్నంపెట్టే రైతులపై కేసులు పెడతారా?

● పోలీసుల తీరుపై సీపీఐ నేతల ఆగ్రహం

కందుకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అన్నం పెట్టే రైతులపై కేసులు పెట్టడం ఎంతవరకు న్యాయమని, ఇది కూటమి ప్రభుత్వానికి పరాకాష్ట అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పోలీసుల తీరుపై మండిపడ్డారు. సోమవారం కరేడు రైతులను కలిసిన ఆయన వారి ఆవేదన విని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కందుకూరు పట్టణ సీపీఐ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో మేము రైతు పక్షపాతులమని నమ్మబలికి గెలిచిన అనంతరం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ రైతులను ఇబ్బందులు పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. కరేడు గ్రామ రైతులకు న్యాయం జరిగే వరకు వారి వెంట నడుస్తామన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన సాగించడం సర్వసాధారణమైందన్నారు. అన్నంపెట్టే రైతులపై పోలీసులు ప్రవర్తించిన తీరు సరికాదన్నారు. రైతుల అభిప్రాయాలు కూడా తీసుకోకుండా ఏకపక్షంగా వారి భూముల లాక్కోవాలనుకోవడం, భయభ్రాంతులకు గురిచేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈనెల 2వ తేదీన సీపీఐ, అనుబంధ వామపక్ష పార్టీలను ఏకం చేసి కరేడు గ్రామాలను సందర్శించి అనంతరం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు హనుమారెడ్డి, వీరారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు, కావలి నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత ప్రసాద్

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరమడుగు, జొన్నవాడ గ్రామాల పరిధిలోని చేపల గుంటలకు కోళ్ళ వ్యర్థాలు తరలించిన రెండు వాహనాలను సోమవారం ఉదయం ఎస్ఐ సంతోష్‌రెడ్డి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం 2 వాహనాల్లోని వ్యర్థాలను నిర్వీర్యం చేసినట్టు ఆయన తెలిపారు.

● కొడవలూరు : అల్లూరుకు అక్రమంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని కొడవలూరులో ఎస్ఐ కోటిరెడ్డి సోమవారం పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.